Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 245 మేడ్చల్ మల్కాజ్‌గిరి 24 సెప్టెంబర్ 2023 ఆదివారం పేజీలు : 4

## వినాయకుడికి రూ.360 కోట్ల బీమా

దేశ ఆర్థిక రాజధానిగా పిలుచుకునే ముంబైలో జీఎస్ బీ సేవా మండల్ అనే సంఘం గణేష్ ఉత్సవాలకు రూ.360 కోట్ల బీమా కవరేజీ తీసుకుంది. అదే సంఘం గతేడాది రూ.316 కోట్లు, 2016లో రూ.300 కోట్ల చొప్పున ఇన్సూరెన్స్ తీసుకోవడం గమ నార్హం. అంత భారీ మొత్తంలో ఇన్సూరెన్స్ ఎందుకు తీసుకోవడం అనే సందేహం మీకు రావచ్చు. ఇక్కడ ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాల సందర్భంగా స్వామికి 70 కిలోల బంగారు ఆభరణాలతో అలంకరిస్తారు. 295 కిలోల వెండి, తదితర లోహాలతో చేసినవీ పూజలో వినియోగిస్తారు. ఈ బీమా గురించి జీఎస్ బీ సేవా మండల్ సిబ్బంది మాట్లాడుతూ.. బంగారం, వెండి తదితర అభరణాలతో పాటు వాలంటీర్లు, పూజారులు, వంట వారు, పాదరక్షల నిర్వాహకులు, పార్కింగ్, సెక్యూరిటీ సిబ్బంది ప్రమాద బీమా కోసం ఏటా ఇలా చేస్తున్నామని వెల్లడించారు.

# వడపోత పూర్తయినట్లేనా!?

# అదృష్టవంతులు వీళ్లేనా?




తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా రెండు నెలలు మాత్రమే సమయం ఉంది. ఇప్పటికే అధికార పార్టీ బీఆర్ఎస్ తమ అభ్యర్థులతో తొలి విడత జాబితాను విడుదల చేసింది. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ కూడా అదే పనిలో నిమగ్నమై ఉంది. ఈ అంశంపై గురువారం, శుక్రవారం రెండు రోజుల పాటు ఢిల్లీలో అభ్యర్థుల ఖరారుపై స్క్రీనింగ్ కమిటీ వరుస సమావేశాలు నిర్వహించింది. శనివారం నాడు ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో మాణిక్‌రావు థాక్రేతో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సమావేశం అయ్యారు. రెండు విడతల్లో కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా విడుదల చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఈనెలాఖరు కల్లా తొలి విడత జాబితా విడుదల చేస్తామని మాణిక్‌రావు థాక్రే వెల్లడించారు. తొలి విడతలో 50 శాతానికి పైగా అభ్యర్థుల ప్రకటన ఉంటుందని తెలిపారు. అభ్యర్థుల జాబితాను కేంద్ర ఎన్నికల కమిటీ విడుదల చేస్తుందన్నారు. 119 నియోజకవర్గాల నుంచి దరఖాస్తు చేసుకున్న 300 మంది పేర్లపై స్క్రీనింగ్ కమిటీ సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేతలు చర్చించారు. సర్వేల ఆధారంగా అభ్యర్థుల ఎంపికను పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ సమావేశంలో ఎన్నికల వ్యూహకర్త సునీల్ తాము చేసిన సర్వేల నివేదికను అధిష్టానానికి అందజేసినట్లు సమాచారం. ఇద్దరు, ముగ్గురు, అంతకన్నా ఎక్కువ మంది పోటీ పడుతున్న నియోజకవర్గాల్లో ఎవరికి ఎంత శాతం గెలుపు అవకాశాలు ఉన్నాయనే దానిపైన వివరాలు అందించగా దానిపై చర్చించి కమిటీ నేతలు అభ్యర్థుల ఎంపికను పూర్తి చేసినట్లు తెలుస్తోంది.

అయితే కాంగ్రెస్ తొలి జాబితాలో సుమారు 60 మంది పేర్లు ఉంటాయని ప్రచారం జరుగుతోంది. తొలి విడత జాబితాలో బలమైన, ముఖ్యమైన అభ్యర్థులతో ఏకాభిప్రాయం ఉన్న కొన్ని స్థానాలలో మాత్రమే అభ్యర్థులను ప్రకటించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించుకుంది.

ఈ మేరకు తొలి జాబితాలో తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి (కొడంగల్), సీఎల్పీ నేత భట్టి విక్రమార్క (మధిర), ఉత్తమ్ కుమార్ రెడ్డి (హుజూర్ నగర్), కోమటిరెడ్డి వెంకటరెడ్డి (నల్గొండ), సీతక్క (ములుగు), పోదెం వీరయ్య (భద్రాచలం), శ్రీధర్ బాబు (మంథని), జగ్గారెడ్డి (సంగారెడ్డి), దామోదర్ రాజనర్సింహ (ఆందోల్), జీవన్ రెడ్డి (జగిత్యాల), జి. వినోద్ (బెల్లంపల్లి), షబ్బీర్ అలీ (కామారెడ్డి), సంపత్ కుమార్ (ఆలంపూర్), వంశీ చంద్ రెడ్డి (కల్వకుర్తి), గడ్డం ప్రసాద్ కుమార్ (వికారాబాద్), పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు, ఫిరోజ్ ఖాన్, ప్రేమ్ సాగర్ రావు, అంజన్ కుమార్ యాదవ్, ఉత్తమ్ పద్మావతి రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, విజయ రమణారావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వంశీకృష్ణ వంటి నేతల పేర్లు ఫైనల్ చేసినట్లు సమాచారం.




# కాంగ్రెస్ జోరు.. బీజేపీ బేజారు!

హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతోంది. దీంతో రాష్ట్రంలో ఇప్పటికే రాజకీయ సందడి మొదలైంది. రాబోయే ఎన్నికల్లో విజయం కోసం పార్టీలు వ్యూహాల్లో మునిగిపోయాయి. ముచ్చటగా మూడోసారి అధికారంలోకి రావాలనే పట్టుదలతో ఉన్న కేసీఆర్.. ఒకేసారి 115 మంది అభ్యర్థులను ప్రకటించి రేసులో ముందున్నారు. ఇక మిగిలిన ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ కూడా ఎన్నికలకు సిద్ధమవుతున్నాయి. కానీ బీజేపీతో పోలిస్తే కాంగ్రెస్ జోరు మీదున్నట్లు కనిపిస్తోంది.

సభలు, సమావేశాలు, చేరికలు, అభ్యర్థుల ఎంపిక.. ఇలా కాంగ్రెస్ పార్టీ దూసుకెళ్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో విజయంపై కాంగ్రెస్ కన్నేసింది. ఆ దిశగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి రాష్ట్రంలో పార్టీని పరుగులు పెట్టిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఓ వైపు అధికార బీఆర్ఎస్ ను ఎండగడుతూనే.. మరోవైపు ఎన్నికల దిశగా పార్టీని బలోపేతం చేస్తున్నారనే టాక్ ఉంది. ముఖ్యంగా కీలక నేతల చేరికలతో పార్టీలో తిరిగి జోష్ పెంచేందుకు రేవంత్ ముమ్మర కసరత్తుల్లో మునిగిపోయారు. బీఆర్ఎస్ టికెట్ దక్కక, ఆ పార్టీలో ప్రాధాన్యత లేక మిగిలిపోయిన నేతలను కాంగ్రెస్లో చేర్చుకునేందుకు రేవంత్ ముందడుగు వేస్తున్నారనే చెప్పాలి. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, ఆయన తనయుడు రోహిత్, బీఆర్ఎస్లో టికెట్ దక్కని సిట్టింగ్ ఎమ్మెల్యే రేఖా నాయక్, బీజేపీ నుంచి యెన్నం శ్రీనివాసరెడ్డి, జిట్టా బాలక్రిష్ణారెడ్డి, ఏనుగు రవీందర్ రెడ్డి తదితర 15 మంది నాయకులు ఈ నెల 17న జరిగే సభలో కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నట్లు తెలిసింది.

మరోవైపు చేరికలు లేక, ఉన్న నాయకులు కూడా వెళ్లిపోతుండటంతో బీజేపీ ఢీలా పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అంతే కాకుండా పార్టీలోని అగ్ర నాయకులు మధ్య విభేదాలు కూడా నష్టం చేస్తున్నాయనే టాక్ ఉంది. ఈటల రాజేందర్ మాటకు పార్టీలో విలువ లేదని తెలుస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో బీజేపీ ఏ మేరకు పుంజుకుంటుదన్నది ప్రశ్నార్థకంగా మారింది.




ప్రజల కోసం రూ.8 లక్షల కోట్లు ఖర్చు చేసిన చంద్రబాబు.. రూ.300 కోట్లకు ఆశపడతా రా? అని భారాస నేత, మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు ప్రశ్నించారు. హైదరాబా ద్‌లో ఎన్టీఆర్ ఘాట్ వద్ద ఆయన నివా ళుల ర్పించారు. జగన్ తీరుపై విమర్శలు గుప్పిం చారు. చంద్రబాబును అక్రమం గా అరెస్టు చేసి జగన్ రాక్షసానందం పొందుతున్నా రని విమర్శించారు. దళిత ద్రోహి అయిన జగన్‌ను ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదన్నా రు. దళితు లు, పేదలు తిరుగుబాటు చేయక ముందే జగన్ క్షమాపణ చెప్పాలన్నారు.




# ఉమ్మడి నల్గొండ జిల్లాలో

# బీఆర్ఎస్ బలమెంత?

# ఎన్ని సీట్లలో పట్టుంది!?

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు సమయం ఆసన్నం అవుతోంది. ఇప్పటికే అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ 116 మందితో తొలి జాబితాను ప్రకటించింది. ఇప్పటి నుంచే ప్రచార పర్వం కొనసాగించాలని అధిష్టానం తమ అభ్యర్థులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఎన్నికలు ఎప్పుడొచ్చినా పోటీకి సన్నద్ధమయ్యేలా ప్రచార పర్వాన్ని ఆ పార్టీ నేతలు కొనసాగిస్తున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 12 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు గులాబీ పార్టీ అధినేత కేసీఆర్ విడుదల చేసిన జాబితాలో చోటు దక్కింది. నకిరేకల్, కోదాడ, దేవరకొండ నియోజక వర్గాల్లో మాత్రం అసమ్మతి సెగలు కక్కుతున్నాయి. సిట్టింగ్‌లకు వ్యతిరేకంగా అసమ్మతి నేతలు సమావేశాలు నిర్వహిస్తూ పార్టీ నేతలకు అల్టిమేటం ఇస్తున్నారు. అయితే ఎన్నికల సమయానికి అన్నీ సర్దుబాటు అవుతాయని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా విషయానికి వస్తే బీఆర్ఎస్ బలం అంతంత మాత్రంగానే కనిపిస్తోంది. జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీ సగం కూడా గెలిచే అవకాశం లేదని స్పష్టమవుతోంది. ముఖ్యంగా నల్గొండ నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డికే సీటు కేటాయించగా ఆయన ఓడిపోతారని సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గెలుస్తారని సర్వేలు చెప్తున్నాయి. అటు మునుగోడులో బీఆర్ఎస్ ప్రస్తుత ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి కూడా ఓటమి పాలవుతారని టాక్ నడుస్తోంది. ఇక్కడ బీఆర్ఎస్ వర్సెస్ బీజేపీ మధ్య పోరు ఉండనుంది. ఉపఎన్నికలో ఓడిపోయినా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం బీజేపీ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విజయం సాధిస్తారని సర్వేల్లో స్పష్టమైంది. మరోవైపు దేవరకొండ ఎస్టీ నియోజకవర్గంలో కూడా బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. రమావత్ రవీంద్రకుమార్ గెలుపు కష్టమని.. కాంగ్రెస్ అభ్యర్థి నేనావత్ బాలునాయక్ విజయం సాధిస్తారని తెలుస్తోంది. అటు నకిరేకల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ మధ్య రసవత్తర పోరు నడుస్తోంది. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి వేముల వీరేశం స్వల్ప తేడాతో ఓటమి చెందారు. ఆయనపై కాంగ్రెస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్య విజయం సాధించి.. బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో వీరేశంకు ప్రాధాన్యత తగ్గడంతో పాటు ఆఖరికి టికెట్ కూడా ఇవ్వలేదు బీఆర్ఎస్ అధిష్టానం. ఇక చేసేదేమీ లేక చిరుమర్తిని ఈసారి ఓడించి తీరాల్సిందేనని కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడానికి వీరేశం ఢిల్లీకి పయనమయ్యారు. గతంలో స్వతంత్ర అభ్యర్థికి ఇచ్చిన 'ట్రక్కు' గుర్తు దెబ్బతో 'కారు' పార్టీ ఓడిపోయింది. దీంతో ఈసారి వీరేశంకే గెలుపు అవకాశాలు మెండుగా ఉన్నాయని కొన్ని సర్వేల్లో తేలింది. ఇక నాగార్జునసాగర్ నియోజకవర్గం విషయానికి వస్తే బీఆర్ఎస్ అభ్యర్థి నోముల భగత్ మరోసారి విజయం సాధించేందుకు గట్టి ప్రయత్నాలే చేస్తున్నారు. కానీ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున జానారెడ్డి బదులు ఆయన కుమార్ రఘువీర్‌రెడ్డి బరిలోకి దిగే అవకాశం ఉంది. దీంతో నోముల భగత్, రఘువీర్ రెడ్డి మధ్య ఆసక్తికర పోటీ ఉండనుంది. మిర్యాలగూడ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి నల్లమోతు భాస్కర్‌రావు మరోసారి ఎమ్మెల్యే పదవిని కైవసం చేసుకోనున్నారు. ఇక్కడ కాంగ్రెస్ నుంచి ఎవరు పోటీ చేస్తారన్న విషయం సస్పెన్స్‌గా మారింది. ఈ విషయం ఆ పార్టీకి మైనస్ అవుతుందని ప్రచారం జరుగుతోంది. హుజూర్ నగర్ నియోజకవర్గం విషయానికి వస్తే బీఆర్ఎస్‌కు మరోసారి నిరాశ తప్పేలా లేదు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ఉత్తమ్ కుమార్ రెడ్డి గెలిచారు. అయితే ఆయన ఎంపీగా పోటీ చేయడంతో ఉపఎన్నిక జరిగింది. అప్పుడు ఈ సీటును బీఆర్ఎస్ అభ్యర్థి సైదిరెడ్డి కైవసం చేసుకున్నారు. కానీ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ఉత్తమ్ పోటీ చేసే అవకాశం ఉండటంతో బీఆర్ఎస్ ఆశలు వదులుకోవాలని సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. 46 శాతం ఓట్లతో ఆయన గెలుపు ఖాయమని వివరిస్తున్నాయి. కోదాడ నియోజకవర్గం విషయానికి వస్తే గత ఎన్నికల్లో స్వల్ప తేడాతో బీఆర్ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్య యాదవ్ విజయం సాధించారు. కానీ వచ్చే ఎన్నికల్లో మాత్రం ఆయనకు షాక్ తప్పదని ప్రచారం జరుగుతోంది. మల్లయ్య యాదవ్‌పై కాంగ్రెస్ అభ్యర్థి ఉత్తమ్ భార్య పద్మావతిరెడ్డి గెలుస్తారని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. సూర్యాపేట నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో మంత్రి జగదీష్‌రెడ్డికి ఎదురుగాలి తప్పదని సర్వేలు చెప్తున్నాయి. వరుసగా రెండుసార్లు గెలిపించినా జగదీష్‌రెడ్డి చేసిన అభివృద్ధి ఏమీ లేదని ప్రజలు అభిప్రాయపడుతున్నారని.. అందుకే కాంగ్రెస్ అభ్యర్థి దామోదర్‌రెడ్డిని గెలిపించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. అటు తుంగతుర్తి ఎస్సీ నియోజకవర్గంలోనూ బీఆర్ఎస్ పార్టీకి షాక్ తప్పేలా లేదు. ఆ పార్టీ అభ్యర్థి గాదరి కిషోర్‌పై కాంగ్రెస్ అభ్యర్థి అద్దంకి దయాకర్‌రెడ్డి 40 శాతానికి పైగా ఓట్లు సాధించి విజయం సాధిస్తారని సర్వేల్లో స్పష్టంగా తెలుస్తోంది. ఆలేరు నియోజకవర్గంలో మాత్రం బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ పార్టీ మధ్య హోరాహోరీ పోరు తప్పదని సమాచారం. గొంగిడి సునీతారెడ్డి, బిక్షమయ్యగౌడ్ మధ్య ఆసక్తికర పోటీ ఉంటుందని తెలుస్తోంది. భువనగిరి నియోజకవర్గంలో మాత్రం బీఆర్ఎస్ మళ్లీ దక్కించుకోనుంది. ఆ పార్టీ అభ్యర్థి పైలా శేఖర్‌రెడ్డి మరోసారి మంచి మెజారిటీతో గెలవనున్నట్లు సర్వేల్లో స్పష్టమైంది.

# సంపాదకీయం

## రైల్లో పిల్లల టికెట్లపై మోడీ మాష్టారి బాదుడుతో ఎంత ఆదాయమంటే?

ప్రధాని మోడీ మాటలకు చేతలకు ఏ మాత్రం లింకు ఉన్నట్లుగా కనిపించదు. తియ్యటి మాటలతో ఇలాంటి ప్రధాని ఇంతవరకు ఎందుకు లేరన్నట్లుగా ఉంటుంది. చేతల విషయానికి వస్తే.. పెద్ద వయస్కులు లేదు. చిన్న పిల్లలు లేదు. తాను బాదాలనుకున్న బాదుడ్ని నిర్మోహమాటంగా బాదేసే తీరు చూస్తే.. ఆయన నిర్ణయాలు ఎలా ఉంటాయన్న విషయం ఇట్టే అర్థమయ్యేలా ఉంటాయి. మోడీ తాతా అధికారంలోకి వచ్చిన తొలి టర్మ్ లో ట్రైన్ లో ప్రయాణించే చిన్నారుల టికెట్లకు సంబంధించి కొన్ని నిబంధనల్ని మార్చటం తెలిసిందే. ఈ మార్పుల కారణంగా రైల్వేశాఖకు ఎంత ఆదాయం వచ్చిందన్న విషయం తాజాగా బయటకు వచ్చింది. ఏడేళ్ల క్రితం మోడీ సర్కారు ట్రైన్ లో ప్రయాణించే చిన్నారుల టికెట్ల విషయంలో కొత్త నిబంధనల్ని తీసుకురావటానికి ముందు.. 5-12 ఏళ్ల చిన్నారులకు విడిగా వేరే బెర్తు ఎంపిక చేసుకున్నా.. టికెట్ ధరలో సగాన్నిమాత్రమే వసూలు చేసేవారు. కానీ.. దానిపై ఫోకస్ చేసిన మోడీ సర్కారు.. 2016 ఏప్రిల్ 21 నుంచి పిల్లలు విడిగా బెర్తు కానీ సీటు ఎంపిక చేసుకుంటే.. పెద్దల మాదిరే పూర్తి టికెట్ ధర చెల్లించేలా నిర్ణయం తీసుకోవటం తెలిసిందే. దీనిపై విమర్శలు వచ్చినా పెద్దగా పట్టించుకోని ఆయన.. తాను అనుకున్నది అనుకున్నట్లుగా అమలు చేశారు. కోవిడ్ సాకు చూపించి పెద్ద వయస్కులు (సీనియర్ సిటిజన్లు) రైల్లో ప్రయాణించే వేళ.. వారికి 50 శాతం టికెట్ రాయితీని సైతం కట్ చేయటం తెలిసిందే. గత ప్రభుత్వాలు పిల్లల టికెట్లకు హాఫ్ ఛార్జీ వసూలు చేస్తే.. మోడీ సర్కారు అందుకు భిన్నంగా వసూలు చేయటం తెలిసిందే. 2016-17 నుంచి 2022-23 వరకు వేర్వేరు ఆర్థిక సంవత్సరాల్లో పిల్లల టికెట్ల మీద ఆదాయం భారీగా పెరిగినట్లుగా పేర్కొన్నారు. ఈ మొత్తం కాలానికి రూ.2800 కోట్లను పిల్లల టికెట్లతో తల్లిదండ్రుల జేబుల మీద భారాన్ని మోపినట్లుగా వెల్లడైంది. రైళ్లలో ప్రయాణించే మొత్తం పిల్లల్లో 70 శాతం మందిపై పూర్తిటికెట్ చెల్లించే భారం పడిన విషయాన్ని సమాచార హక్కు చట్టం కింద దాఖలు చేసిన దరఖాస్తు కారణంగా బయటకు వచ్చింది. ఇక.. 2022-23 ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా రూ.560 కోట్ల ఆదాయం వచ్చినట్లుగా పేర్కొన్నారు. ఏమైనా.. పిల్లలు.. పెద్దల టికెట్ల విషయంలోనూ మరీ ఇంత బాదుడు అవసరమా? అన్న ప్రశ్నకు సరైన సమాధానాన్ని మోడీ సర్కారు ఇప్పటివరకు ఇచ్చింది లేదు.

# పల్లె వనాలపై నిర్లక్ష్యం



జగిత్యాల : గ్రామీణ ప్రజలకు ఆహ్లాదం అందించేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పల్లె ప్రకృతి వనాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఉపాధి హామీ పథకంలో పనులు ప్రారంభించినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో పూర్తిచేసేందుకు చాలా రోజులు పట్టింది. గ్రామాలకు దూరంగా వీటిని ఏర్పాటు చేయడంతో ప్రజలు ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుతం వేసవి సమీపిస్తున్నందున మొక్కలు నీరు లేక ఎండిపోతున్నాయి. పల్లెప్రకృతి వనాలకు నీటివసతి కల్పించకపోవడంతో కొన్నిచోట్ల ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నప్పటికీ గ్రామపంచాయతీలకు ఇది భారంగా మారింది. జిల్లాలోని పల్లెప్రకృతి వనాల ప్రస్తుత పరిస్థితిపై బృందం పరిశీలించింది. ఈ వివరాల..

పట్టించుకోవడం లేదు..జగిత్యాల గ్రామీణ మండలంలో 29 పంచాయతీలకుగాను 29 పల్లె ప్రకృతి వనాలు నిర్మించగా, అర్బన్ మండలంలో 5 పంచాయతీలకు 5 నిర్మాణం జరిగాయి. అయితే కొన్ని గ్రామాల్లో ట్రాక్టర్లతో నీళ్లు పట్టిస్తుండగా కొన్ని గ్రామ పంచాయతీల్లో వాటిని పట్టించుకోవటంలేదు. మరి కొన్ని గ్రామాల్లో బోర్‌వెల్ ఉన్న దగ్గర నీటిని పట్టిస్తున్నారు. మొక్కలు కాస్త చెట్లుగా మారగా వేసవిలో నీళు పటిస్తే ఫలితాలు ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఎండుతున్న మొక్కలు..ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాల్లో మొక్కలకు నీరందక ఎండుతున్నాయి. సారంగాపూర్ మండలంలో 18 గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా పోతారంలో బృహత్ పల్లె ప్రకృతి వనంతోపాటు సారంగాపూర్, రేచపల్లిలో కోతుల ఆహార ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలకు నేరుగా నీటి సరఫరా లేకపోవడంతో కొన్ని పంచాయతీలలో ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. పెరుగుతున్న ఎండల తీవ్రతకు ట్యాంకర్ల ద్వారా పూర్తిస్థాయిలో నీరందించకపోవడంతో నాటిన మొక్కలు ఎండిపోతున్నాయి. కొన్ని గ్రామాల్లో గ్రామానికి దూరంగా ఉండడంతో ఆహ్లాదం కరవైంది. మరికొన్ని గ్రామాల్లో పక్కపక్క గ్రామాల పల్లె ప్రకృతి వనాలు ఒకే దగ్గర ఏర్పాటు చేయడంతో ప్రభుత్వ నిధులు వృథా అయ్యాయి.

ఆహ్లాదం అంతంతే!

మెట్‌పల్లి మండలంలోని 23 గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల ప్రకృతి వనాలు ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతుండగా, చాలా చోట్ల అంతంతమాత్రంగానే ఉన్నాయి. నీడనిచ్చే చెట్లను నాటాలని చెప్పగా, మొదట్లో పలు గ్రామాల్లో పూల మొక్కలను నాటారు. ఖాళీగా ఉన్న స్థలాల్లో మొక్కలను నాటాలని అధికారులు సూచిస్తున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఉపాధి హామీ పథకం నుంచి నిర్వహణ గతేడాది మార్చిలోనే ముగియడంతో ప్రస్తుతం గ్రామ పంచాయతీలు చూసుకోవాల్సి ఉంది. ప్రకృతి వనాల్లో కొన్ని చోట్లనే నీటి వసతి అందుబాటులో ఉండగా, మిగతా చోట్ల ట్యాంకర్ ద్వారా మొక్కలకు నీరందించాల్సిన పరిస్థితి ఉంది. పలుచోట్ల నీరందక మొక్కలు, పచ్చని గడ్డి ఎండుముఖం పట్టాయి. పలు పంచాయతీలకు ట్యాంకర్ ద్వారా నీరందించడం ఆర్థికంగా భారమవుతుందని పేర్కొంటున్నారు.

మొక్కల చుట్టూ పాదులుమల్లాపూర్ మండలంలోని 23 పంచాయతీలో పల్లెప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. వేసవిలో నీటి ఎద్దడిని తీర్చేందుకు పంచాయతీల్లో ఉన్న వాటర్ ట్యాంకులతో నీటిని అందిస్తున్నారు. ఎండాకాలంలో మొక్కలు ఎండిపోకుండా ఉండేందుకు మొక్కల చూట్టూ పాదులను ఏర్పాటు చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కొన్ని గ్రామాల్లో మొక్కలు ఎండిపోతున్నాయి. రక్షణ చర్యలు చేపట్టడంతో పాటు వేసవిలో మొక్కలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# ముందుకు సాగని మరమగ్గాల ఆధునికీకరణ



సిరిసిల్ల: జిల్లా వస్త్రోత్పత్తి పరిశ్రమలోని మరమగ్గాల ఆధునికీకరణ మూడేళ్లుగా ముందుకు సాగడం లేదు. 2017-20లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నూరు శాతం రాయితీతో ఆధునికీకరణకు ప్రణాళికలు చేశాయి. అందులో జిల్లా నుంచి 15,000 మరమగ్గాలను ఆధునికీకరించుకునేందుకు యజమానులు ముందుకొచ్చారు. దీనిలో ఒక్కో మరమగ్గానికి గరిష్ఠంగా రూ.40 వేల వరకు ఖర్చు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరి సగం చెల్లించేలా ప్రణాళికలు చేశారు. ఆధునికీకరణ చేసే కంపెనీల ఎంపిక, దరఖాస్తుల పరిశీలన దశలో కేంద్ర రాయితీలో రూ.7 వేలు తగ్గిస్తున్నట్లు రాష్ట్ర టెక్స్‌టైల్ కమిషన్‌కు లేఖ పంపారు. అప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ.30 కోట్లు కేటాయించింది. దీంతో వాటాలు తేలక ఆ ప్రక్రియ సందిగ్ధంలో పడింది. అప్పటికే దరఖాస్తు చేసుకున్న ఎనిమిది వేల మరమగ్గాలకు రాష్ట్రం ప్రభుత్వం వాటా నుంచి ఆధునికీకరించారు. 2019-20లో బతుకమ్మ చీరల్లో డిజైన్లు మార్చారు. వాటిని డాబీ, జకార్డు అమర్చిన మరమగ్గాలపై మాత్రమే ఉత్పత్తి చేయాలి. మహారాష్ట్ర, గుజరాత్ పరిశ్రమల్లోని మగ్గాలపై వాడిన పరికరాలను కొనుగులు చేసి ఇక్కడి వాటికి అమర్చి వస్త్రోత్పత్తి చేశారు. ఇలా ఒక్కో మగ్గానికి గరిష్ఠంగా రూ.20 వేల వరకు ఖర్చయింది. వీటికైనా ప్రభుత్వం రాయితీ ఇవ్వాలని పరిశ్రమ వర్గాలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. రాయితీలు కొత్త పరికరాలకు మాత్రమే వర్తిస్తాయనే నిబంధన ఉండటంతో నిరాశ ఎదురైంది. బతుకమ్మ చీరల ఉత్పత్తిలో మీటరుకు రూపాయి చొప్పున చెల్లిస్తుండటంతో మూడేళ్లుగా తాత్కాలిక ఉపశమనం లభిస్తోంది. పూర్తిస్థాయి ఆధునికీకరణ మాత్రం నోచుకోవడం లేదు.టెక్స్‌టైల్ పార్కులోనూ..టెక్స్‌టైల్ పార్కులో ర్యాపియర్ మగ్గాలున్నాయి. వీటి ఆధునికీకరణ రెండు విధాలుగా ఉంది. అందులో ఒకటి మగ్గాలకు డాబీ, జకార్డు పరికరాలు అమర్చితే చేతి రుమాలు మొదలు పట్టుచీరల వరకు డిజైన్లకు అనువుగా ఉత్పత్తి చేయొచ్చు. రెండోది ర్యాపియర్ మగ్గాల స్థానంలో ఎయిర్, వాటర్‌జెట్ మగ్గాలను ఏర్పాటు చేయడం. ఇప్పుడున్న ర్యాపియర్ మగ్గాలపై ఒక షిఫ్టునకు ఒక మగ్గంపై 50 మీటర్ల వస్త్రం ఉత్పత్తి అయితే, ఎయిర్‌జెట్ మగ్గంపై 250 మీటర్లు ఉత్పత్తి చేయొచ్చు. అందులో ఆర్పీఎం (రెవల్యూషన్ ఫర్ మినిట్) బట్టి ఉత్పత్తి ఉంటుంది. దీనిలో ఒక్కో మగ్గానికి రూ.50 లక్షల వరకు ఖర్చవుతుంది. వీటిపై అధ్యయనం చేసేందుకు గతేడాది టెక్స్‌టైల్ పార్కులోని యజమానులు మహారాష్ట్ర, చెన్నైల్లోని వస్త్రోత్పత్తి ప్రాంతాలను సందర్శించి వచ్చారు. తర్వాత రాష్ట్ర చేనేత, జౌళిశాఖ పార్కులోని యజమానులతో సమావేశం నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వం టీ-ట్యాప్ (తెలంగాణ టెక్స్‌టైల్ అపారల్ పాలసీ) గురించి వివరించారు.

దాదాపు 20 మంది యజమానులు టీ-ట్యాప్ పథకంలో ఆధునికీకరణకు ఆసక్తి చూపారు. దీనిలో కొంత మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు కూడా చేసుకున్నారు. ఆరు నెలలుగా పరిశీలన దశలోనే ఉన్నాయి. ఈ పథకంలో ఒక యూనిట్‌కు మహిళలకు 35 శాతం, పురుషులకు 25 శాతం ప్రభుత్వం రాయితీ ఇవ్వనుంది. అయితే యజమానులు యూనిట్ ఏర్పాటు చేసుకున్న ఎన్ని నెలల్లో రాయితీ విడుదల అవుతుందనేది స్పష్టత లేకపోవడంతో యజమానులు కొంత వెనకడుగు వేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం నుంచి స్పష్టత రావాలి.ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలిఅశోక్, ప్రాంతీయ సహాయ సంచాలకుడు, చేనేత, జౌళిశాఖఆసక్తి ఉన్న యజమానులు టీ-ట్యాప్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందులో కొత్త పరికరాలు, మరమగ్గాలను మాత్రమే కొనుగోలు చేయాలి. పాత వాటికి ఈ పథకం వర్తించదు. అన్నీ పరిశీలించాకే రాయితీ విడుదలవుతుంది.

# నమ్మించి.. నట్టేట ముంచి..!

నల్గొండ : నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసం కింద 60 ఏళ్ల కిందట ఇచ్చిన భూములవి. దట్టమైన అడవి, సుదూర ప్రాంతం కావడంతో సుమారు 70 శాతం మంది నిర్వాసితులు ఈ భూముల్లోకి రాలేదు. దీంతో స్థానికంగా ఉన్న కొందరు వీటిని ఆక్రమించి సామాన్యులకు కట్టబెట్టారు. ఇదంతా మఠంపల్లి మండలం పెదవీడు రెవెన్యూ పరిధిలోని సర్వే సంఖ్య 540లో ఉన్న భూముల పరిస్థితి. గతంలో గుర్రంబోడు వివాదం సైతం ఇదే సర్వే నెంబరులోని ఉన్న భూములపైనే జరగడం గమనార్హం. 540లో మొత్తం 6,239 ఎకరాల భూమి ఉంది. ఇందులో 2,411.27 ఎకరాలు అటవీ భూమి కాగా..1,951 ఎకరాలు ప్రభుత్వ భూమి. మిగిలిన 1,876.01 ఎకరాలను గతంలోనే 328 కుటుంబాలకు 1960లో సాగర్ నిర్వాసితులుగా గుర్తిస్తూ అప్పటి ప్రభుత్వం డీ - ఫాం పట్టాలిచ్చింది. అయితే ఇందులో ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు స్థానిక నేతల మద్దతుతో ఆక్రమించి వెంచర్లుగా విభజించి సామాన్యులకు అమ్మేశారు. తమకు పట్టాలున్నాయని చెబుతూ గుంటల వారీగా అమ్మకాలు జరిపారు. గుంటకు రూ.60 వేల నుంచి రూ.80 వేల వరకు వెచ్చించి..అక్కడే ఉన్న సామాన్యులు ఇళ్లు కట్టుకుందామని కొనుగోలు



చేసి ప్లాట్ల వారీగా ప్రహరీలు సైతం నిర్మించారు. కొన్ని రోజుల తర్వాత ఆ స్థలం ప్రభుత్వ భూమి అని తేల్చిన రెవెన్యూ అధికారులు ప్రహరీలు కూల్చి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీంతో రూ.లక్షలు పోసి కొన్న స్థలాలు తీరా ప్రభుత్వానివని తేలడంతో స్థలాలు కొన్న బాధితులు లబోదిబోమంటున్నారు. మరోవైపు తమకు స్థలాలు అమ్మినవారిని నిలదీస్తే తమకు స్వాతంత్ర్య సమర యోధుల కోటాలో ఈ భూములు వచ్చాయని చెబుతూ తప్పించుకుంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు ఏడెకరాల్లో ప్రస్తుతం వివాదం నడుస్తుండగా..మరికొంత భూమి సైతం తప్పుడు రికార్డులతో కొంత మంది ‘పెద్దల’ చేతులో ఉన్నాయని రెవెన్యూ వర్గాలు భావిస్తున్నాయి. వీటి విలువ సుమారు రూ.20 కోట్ల వరకు ఉంటుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

బాధితులకు న్యాయం చేస్తాం

వెంకట్‌రావు, కలెక్టరు, సూర్యాపేట

ఈ అంశంపై క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులను సమగ్ర విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశిస్తాం. బాధితులకు న్యాయం చేస్తాం.

# బకాయిలు వచ్చేశాయ్..!

నల్గొండ : మహిళా సంఘాలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. రెండు సంవత్సరాలకు సంబంధించి వడ్డీ బకాయిలు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గత నాలుగేళ్లుగా మహిళా సంఘాలకు వడ్డీ డబ్బులు జమ చేయకపోవడంతో సభ్యులంతా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పేదరిక నిర్మూలన పథకంలో భాగంగా ప్రభుత్వం ఏటా బ్యాంకు లింకేజీల ద్వారా రుణాలు అందిస్తోంది. రుణాలకు చెల్లించిన వడ్డీ డబ్బులను తిరిగి చెల్లించకపోవడంతో సంఘ సభ్యులు ఎదురు చూశారు. తాజాగా వడ్డీ సొమ్ము జమ కావడంతో..వారిలో ఆనందం నెలకొంది.

రెండేళ్ల వడ్డీ సొమ్ము విడుదల

2018-19, 2019-20 ఆర్థిక సంవత్సరాలకు గాను ప్రభుత్వం ఉమ్మడి జిల్లాకు రూ.137 కోట్లు విడుదల చేసింది. మరో రెండేళ్లకు సంబంధించి మరిన్ని నిధులు విడుదల కావాల్సి ఉంది. బకాయిల వివరాలను జిల్లాల యంత్రాంగం ప్రభుత్వానికి నివేదించింది. వారం కిందట మంత్రి హరీష్‌రావు దృష్టికి వెళ్లడంతో.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బకాయిలను త్వరలో రెండు విడతల కింద విడుదల చేస్తామని ప్రకటించారు. మహిళా సంఘాలు సంఘంగా ఏర్పడి ఖాతా తెరచి



క్రమం తప్పకుండా పొదుపు చేస్తే..బ్యాంకు రుణం ఇస్తుంది. సభ్యులు తలా కొంత నగదు తీసుకుని స్వయం ఉపాధికి ఉపయోగించుకుంటారు. నెలవారీగా వడ్డీతో కలిపి తిరిగి చెల్లిస్తారు. నాలుగైదు నెలలకోసారి ప్రభుత్వం వడ్డీని విడుదల చేస్తోంది. అలా వచ్చిన డబ్బులను బ్యాంకులో ఉన్న మొత్తం రుణంలో తగ్గిస్తారు. దీంతో వడ్డీ భారం సంఘాలపై పడదు. కానీ నాలుగేళ్లుగా ప్రభుత్వం నుంచి రావాల్సిన డబ్బులు సంఘాల ఖాతాల్లో జమ కావడం లేదు. దీంతో సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

సద్వినియోగం చేసుకోవాలి

కిరణ్‌కుమార్, డీఆర్డీవో, సూర్యాపేట

రెండేళ్లకు సంబంధించిన వడ్డీ రాయితీని ప్రభుత్వం జిల్లాకు విడుదల చేసింది. ఆ నిధులను త్వరలో జిల్లాలోని ఆయా మహిళా స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన సభ్యుల ఖాతాల్లో జమ అవుతాయి. తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా చెల్లిస్తే ప్రభుత్వం వడ్డీ రాయితీ ఇస్తుంది. మగువలు రాయితీలు, రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలి.

# సంపద వనాలతో స్థలాల ఆక్రమణకు అడ్డుకట్ట

బోయినపల్లి: జలవనరులశాఖ ఆధీనంలో ఉన్న మిగులు స్థలాలు, జలాశయాల కింద స్థలాలు ఆక్రమణకు గురికాకుండా ఉండేందుకు ప్రభుత్వం ఆదేశాల మేరకు అధికారులు చర్యలు చేపట్టారు. పలు చోట్ల విలువైన భూములు కబ్జాకు గురవుతుండటంతో సంపద వనాల పెంపకంపై దృష్టి సారించారు. రాజరాజేశ్వర, ఎగువమానేరు జలాశయాల కింద భూముల్లో పదిహేను బ్లాకుల్లో మొక్కల పెంపకం చేపడుతున్నారు. దీంతో స్థలాల ఆక్రమణకు అడ్డుకట్ట పడటంతోపాటు వాటి పరిసరాలు పచ్చదనంతో ఆహ్లాదం పంచనున్నాయి.

జిల్లాలో బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద రాజరాజేశ్వర (మధ్యమానేరు), గంభీరావుపేట మండలం నర్మాల వద్ద ఎగువమానేరు జలాశయాలు ఉన్నాయి. వీటి పరిసరాల్లో జలవనరుల శాఖకు చెందిన విలువైన మిగులు స్థలాలు ఉన్నాయి. అవి ఆక్రమణకు గురికాకుండా ఉండేందుకు, మొక్కలు పెంచడం వల్ల వాటి వద్దకు వచ్చే సందర్శకులకు పచ్చదనంతో ఆహ్లాదం పంచే విధంగా సంపద వనాలు పెంచాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా జలవనరులశాఖ అధికారులు తమ ఆధీనంలో ఉన్న స్థలాలను గుర్తించి ఈజీఎస్ అధికారులు నివేదిక ఇచ్చారు. అటవీశాఖ అధికారులు సంబంధిత స్థలాలను పరిశీలించి అందులో మొక్కలు పెంచాలని నిర్ణయించారు. ఇందుకోసం నాంపెల్లి, తిమ్మాపూర్ తదితర అటవీశాఖ నర్సరీల నుంచి నల్లమద్ది, తెల్లమద్ది, వెదురు, నాపనార, కానుగ, అల్లనేరేడు, సీతాఫలం వంటి మొక్కలను తీసుకొచ్చారు. బోయినపల్లి మండలంలోని కొదురుపాక, నీలోజిపల్లి, కొత్తపేట, మాన్వాడ గ్రామాల పరిధిలో పది బ్లాకులు, నర్మాల ఎగువమానేరు జలాశయం వద్ద అయిదు బ్లాకుల్లో మొత్తం 24.4 ఎకరాల్లో సుమారు 11,759 మొక్కలు నాటారు. వాటి సంరక్షణకు పంచాయతీరాజ్‌శాఖ అధికారుల పర్యవేక్షణలో చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి గేటు బిగించారు. మొక్కల సంరక్షణ బాధ్యతను ఈజీఎస్ అధికారులు పర్యవేక్షించనున్నారు.

పచ్చదనం సంతరించుకుంటుంది

జలాశయం కింద హరితహారంలో నాటిన మొక్కలతోపాటు సంపద వనాల్లో నాటిన మొక్కలు పెరిగితే జలాశయ పరిసర ప్రాంతం కనుచూపు మేర పచ్చదనం సంతరించుకుంటుంది. మొక్కల సంరక్షణకు అధికారులు చర్యలు తీసుకోవాలి. గతంలో నాటిన మొక్కలు ఎండిపోయిన సందర్భాలు ఉన్నాయి. అలా జరగకుండా అధికారులు పర్యవేక్షణ చేయాలి.

సాయి, మాన్వాడఆదాయం సమకూరుతుంది

జలాశయాల కింద సంపద వనాల్లో నాటిన మొక్కల వల్ల ఆదాయం సమకూరనుంది. జలాశయాల స్థలాలు ఆక్రమణకు గురికాకుండా ఉంటాయి. సందర్శనకు వచ్చే పర్యాటకులకు పరిసరాలు పచ్చదనంతో ఆహ్లాదాన్ని పంచుతాయి. మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. ప్రతి ఒక్కరూ మొక్కల సంరక్షణ చేపట్టాలి. మదన్‌మోహన్, అదనపు డీఆర్డీవో

# కోల్ బెల్టులో భూ మాఫియా !

గోదావరిఖని: కోల్‌బెల్టు ప్రాంతంలో కొందరు ముఠాగా ఏర్పడి ప్రైవేటు సైన్యం ఏర్పాటు చేసుకుని కబ్జాలకు పాల్పడుతున్న ఘటనలు పెరిగిపోతున్నాయి. రామగుండం ప్రాంతంలో భూమి విలువ భారీగా పెరిగింది. బలం ఉన్న వారు వీటిని దక్కించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో సామాన్యులే ఎక్కువగా బలవుతున్నారు. ముఠా సభ్యుల వేధింపులను కొందరు బయటకు చెప్పుకోలేక విలువైన భూములను ఎంతోకొంతకు వదిలేసుకుంటున్నారు. మరి కొందరు పోలీసు ఠాణా వరకు వెళ్తున్నారు. ఇవి సివిల్ వివాదాలు కావడంతో పోలీసులు వాటిపై పెద్దగా దృష్టి సారించలేకపోతున్నారు. ఫలితంగా బాధితులు ఏదో ఒక ముఠా నాయకుడి వద్దకు వెళ్లి పరిష్కారం కోసం ఎంతో కొంత ముట్టజెప్పుతున్నారు. గోదావరిఖనిలోని మార్కండేయకాలనీ, శారదానగర్, అడ్డగుంటపల్లి, సంజయ్‌నగర్, ఇందిరానగర్, గణేశ్‌నగర్, సప్తగిరికాలనీ ప్రాంతాల్లో ప్రైవేటు భూములున్నాయి. ఎన్టీపీసీ ప్రాంతంలోని కృష్ణానగర్, అన్నపూర్ణకాలనీ, కాజీపల్లి, మాతంగికాలనీ, మాజీసైనికుల కాలనీ ప్రాంతాల్లో ఉన్న భూముల్లోనే ఎక్కువగా దందాలు సాగుతున్నాయి. ఈ ప్రాంతాల్లో ఎక్కడ భూ క్రయవిక్రయాలు జరిగినా ముఠాల కనుసన్నల్లోనే జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాదని ఎవరైనా కొనుగోలు చేస్తే ఏదో ఒక వివాదం సృష్టిస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ భూములపై...సాధారణంగా ప్రైవేటు, పట్టా భూములపై ఆధిపత్యం చెలాయిస్తున్న కొంతమంది ప్రభుత్వ భూములపై సైతం కన్నేస్తున్నారు. తమ ఆధీనంలోకి తీసుకొని దర్జాగా విక్రయిస్తున్నారు. రెవెన్యూ రికార్డుల్లో ఉన్న లొసుగులను ఆధారంగా చేసుకుని విలువైన ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ఏకంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న సంఘటనలు రామగుండం ప్రాంతంలో చోటు చేసుకున్నాయి. పేదల ఇళ్ల కోసం కేటాయించిన ఇందిరమ్మ స్థలాలను ఇప్పటికే కొంత మంది కబ్జాచేసి అమ్ముకుంటున్నారు. ఏకంగా అందులో ఇళ్లు నిర్మించి విక్రయిస్తున్నారు. దీంతో పాటు రహదారి కోసం సింగరేణి సంస్థ సేకరించిన భూమిని సైతం ఆక్రమించిన కొందరు రియల్ వ్యాపారం చేస్తున్నారు. మల్కాపూర్, జంగాలపల్లి శివారులో ఉన్న ప్రభుత్వ భూములు చాలా వరకు కనుమరుగయ్యాయి. ఎక్కడ ఖాళీ జాగా కనిపించినా పాగా వేసేందుకు కొన్ని ముఠాలు ప్రత్యేకంగా అదే పనిపై తిరుగుతున్నాయి. రెవెన్యూ శాఖలోని కొంత మందిని తమకు అనుకూలంగా మలుచుకుని ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకుంటున్నట్లు తెలుస్తోంది.

కఠిన చర్యలు తప్పవు

చట్టాన్ని ఎవరు చేతుల్లోకి తీసుకున్నా కఠిన చర్యలు తీసుకుంటాం. భూ వివాదాలు, సెటిల్‌మెంట్ల పేరుతో ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే తీవ్రంగా పరిగణిస్తాం. సామాన్యులను ఇబ్బందులకు గురిచేసేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. బాధితులు నేరుగా పోలీసులకు సమాచారం ఇస్తే న్యాయం జరిగేలా చర్యలు చేపడతాం.

రెమా రాజేశ్వరి, రామగుండం సీపీ

గోదావరిఖని ప్రాంతంలో కొన్ని సంవత్సరాల క్రితం ఓ సామాన్యుడు భూమి కొనుగోలు చేశాడు. తక్కువ ధర ఉన్న సమయంలో కొనుగోలు చేసిన సదరు వ్యక్తి ఇళ్లు నిర్మించుకోవడానికి పనులు చేపట్టేందుకు సిద్ధమయ్యాడు. వెంటనే అక్కడికి చేరుకున్న ఓ ముఠా సభ్యులు పనులను అడ్డుకున్నారు. ఈ స్థలం మాదంటు బెదిరించారు. తన వద్ద అన్ని పత్రాలు ఉన్నాయని, చాలా కాలం క్రితం కొనుగోలు చేశానని మొత్తుకున్నా ఇంటి నిర్మాణం చేపట్టకుండా పనులు నిలిపివేశారు. చివరికి ఆ ముఠా పెద్దను కలిసి ప్రసన్నం చేసుకుంటే గాని పనులు చేసుకునే అవకాశం రాలేదు.

ఎన్టీపీసీలోని రియల్‌భూం ఉన్న ప్రాంతంలో ఓ వ్యక్తి భూమి కొనుగోలు చేశాడు. దీనిపై పూర్తి హక్కులు మావంటూ ఒక ముఠా అక్కడికి చేరుకుంది. అతను చేసిన రిజిస్ట్రేషన్ చెల్లదంటూ వేధించారు. ఎవరికి చెప్పుకోవాలో తెలియక సదరు వ్యక్తి పరిష్కారం కోసం కొంత మంది పెద్దమనుషులను ఆశ్రయించాడు.

# పరిశీలన పక్కానా.. ఓటు దక్కేనా!


కరీంనగర్: ఎన్నికల తరుణం ముంచుకొస్తున్న వేళ ఉమ్మడి జిల్లాలో తుది ఓటరు జాబితా రూపకల్పన దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే పలుమార్లు కొత్తగా ఓటరుగా చేరేవారికి అవకాశం దక్కింది. కేంద్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు త్వరలో జరిగే శాసనసభ ఎన్నికలకు అవసరమైన తుది ఓటరు జాబితా కసరత్తు దాదాపుగా కొలిక్కి రాబోతోంది. ఈ నెల 19వ తేదీ వరకు కొత్తగా ఓటు హక్కును పొందేవారికి అవకాశం ఉండటంతో రికార్డు స్థాయిలో దరఖాస్తులు ఆయా మండలస్థాయి అధికారుల చేతికి చేరాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1.30 లక్షలకుపైగా యువతీ యువకులు అర్జీలు ఇచ్చారు. వీరితోపాటు ఓటు గల్లంతైన వారు కూడా ఫారం-6తో మరోసారి ఓటును పొందేందుకు ఆసక్తిని చూపించారు. వారం రోజుల వ్యవధిలోనే వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులెవరనేది పోలింగ్ బూత్ స్థాయిలో తేల్చనున్నారు. వచ్చే నెల 4వ తేదీన తుది ఓటరు జాబితా వెలువడనున్న నేపథ్యంలో ఈ కసరత్తు కీలకంగా మారనుంది.

మూడు రకాలుగా అర్జీలు..

ఫారం-6 ద్వారా కొత్తగా ఓటు పొందాలనుకునేవారు ఫారం-6, మరణించినవారు లేదా స్థానికంగా నివాసం ఉండనివారు ఫారం-7, ఓటు మార్పు, చేర్పుల కోసం ఫారం-8 ద్వారా దరఖాస్తులు చేసుకున్నారు. మొత్తంగా 2,74,357 దరఖాస్తులు అందాయి. ఇందులో కొత్తవి 1,30,586 ఉంటే తొలగించాల్సినవే 59,615 ఉండటం గమనార్హం. మరోవైపు ఓటు మార్పు విషయంలోనూ చాలా మంది అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగపర్చుకున్నారు. 84,156 మంది తమ పేరు, చిరునామా ఇతర మార్పులు చేర్పుల కోసం అర్జీని పెట్టుకున్నారు. నాలుగు జిల్లాల పరిధిలోని 12 నియోజకవర్గాల్లో పోలింగ్ బూత్‌ల వారీగా ఈ పరిశీలన జరుగనుంది. 3,507 మంది పోలింగ్ బూత్‌స్థాయి అధికారుల పర్యవేక్షణలో సిబ్బంది వచ్చిన దరఖాస్తులోని వివరాల ఆధారంగా తుది ఆమోదం తెలుపనున్నారు. ఇప్పటికే ఆయా నియోజకవర్గాల వారీగా కొత్త ఓటర్ల విషయంలో చాలావరకు అర్జీలు సరిగ్గానే ఉన్నాయని విచారణలో తేల్చారు. ముఖ్యంగా మరణించిన వారి ఓట్ల విషయంలో జాప్యం చేశారు. ఇప్పుడు తుది ఓటరు జాబితాను సిద్ధం చేస్తున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో వీరిని గుర్తించి వారి కుటుంబీకులతో దరఖాస్తుని తీసుకున్నారు. దీని ఆధారంగా ఉన్న వాటిలో నుంచి 59,615 మందిని తొలగించనున్నారు.

ఇదే సమయంలో కొత్త ఓటర్లు దాదాపుగా లక్షకుపైగా ఉమ్మడి జిల్లాలో పెరుగనున్నారు. వయస్సు నిర్ధారణ ధ్రువపత్రాలు సరిగ్గా లేనివారివి తిరస్కరించనున్నారు. ఇక మార్పులు చేర్పుల కోసం దండిగానే దరఖాస్తులందాయి. వీటన్నింటిని సక్రమంగా పరిశీలిస్తేనే ఓటు వేసే సమయంలో ఎలాంటి ఆందోళన లేకుండా ఓటరు తన హక్కును వినియోగించుకునే వీలుంటుంది. లేదంటే తప్పుల తడకతో కూడిన ఇబ్బంది ఎప్పటిలాగే పోలింగ్ రోజున బహిర్గతమవనుంది. ఈ క్రమంలోనే యంత్రాంగమంతా గత తప్పిదాలకు అవకాశం లేకుండా పక్కాగా పరిశీలన చేపట్టే పనిలో నిమగ్నమయ్యారు.

# పల్లెలు మెరవాలి.. ప్రగతి మురవాలి




కరీంనగర్: అక్టోబరు 2 గాంధీ జయంతి వరకు 18 రోజులపాటు నిర్వహించే స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల ద్వారా ప్రతి పల్లె సిరిమల్లెలా మెరవాలని జిల్లా అధికార యంత్రాంగం పనులకు శ్రీకారం చుట్టాయి. గతంలో నిర్వహించిన కార్యక్రమంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాలు రాష్ట్ర స్థాయి అవార్డులు గెలుచుకున్నాయి. గాంధీ జయంతిని పురస్కరించుకొని 2017లో ప్రధాని నరేంద్రమోదీ స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈసారి కూడా కార్యాచరణతో ముందుకెళ్తే మరో దఫా పల్లెలు మరిన్ని జిల్లా, రాష్ట్ర, జాతీయ పురస్కారాలు గెలుచుకునే అవకాశముంది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా..స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ఉమ్మడి జిల్లా నుంచి పలు గ్రామాలు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చేతుల మీదుగా అవార్డులు అందుకున్నాయి. వీటిలో కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలంలోని ఖాసీంపేట, రామడుగు మండలం వెలిచాల, పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి, ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్, రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్ణపల్లి, ముస్తాబాద్ మండలం నామాపూర్, జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం చింతల్‌పేట గ్రామాలు ఉన్నాయి.

గతంలో పక్కా పనులతో..గ్రామాల్లో స్వచ్ఛతాహీ సేవలో భాగంగా ప్రభుత్వం నిర్దేశించిన అంశాలైన రహదారుల శుభ్రం, డ్రైనేజీల్లో మురుగు తొలగింపు, నిత్యం చెత్త సేకరణ, కంపోస్టు ఎరువుల తయారీ, ప్లాస్టిక్ నిషేధంపై చైతన్యం, కూడళ్లు, గోడలపై నినాదాల ద్వారా ప్రజలకు కనువిప్పు కలిగేలా అవగాహన కల్పించారు. 18 రోజులపాటు జరిగే ఈ కార్యక్రమానికి అధికారులతోపాటు ప్రజలనూ భాగస్వాములుగా చేశారు. అదే ఒరవడిని ఈ దఫా సైతం కొనసాగించడానికి అధికార యంత్రాంగం సమాయత్తమైంది.

ఈసారి చేపట్టే ప్రత్యేక కార్యక్రమాలు..

ప్రజలు జూట్ సంచులు వినియోగించేలా అవగాహన కల్పించడం.

స్వచ్ఛత ప్రాధాన్యంపై విద్యాలయాల్లో విద్యార్థులకు క్విజ్ పోటీల నిర్వహణ, పారిశుద్ధ్యంపై, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించడం.పంచాయతీ పాలకవర్గాలు, మండల ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజల శ్రమదానంతో పారిశుద్ధ్య పనులు నిర్వహించడం.గ్రామ కూడళ్లు, ప్రజోపయోగ స్థలాలు, పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చెత్త, మురుగు తొలగింపు.పర్యాటక ప్రదేశాల్లో ప్లాస్టిక్ నిషేధం సంపూర్ణంగా అమలయ్యేలా చూడడం.

పంచాయతీల ఆధ్వర్యంలో మొక్కల సంరక్షణ.

గ్రామాల్లోని ఇళ్ల గోడలపై స్వచ్ఛత నినాదాలు రాయించడం.

నిత్యం ఇల్లిల్లు తిరిగి చెత్త సేకరణ.

కంపోస్టు షెడ్డులో తడి, పొడి చెత్త వేరుచేయటం, సేంద్రియ ఎరువుగా మార్చే చర్యలు చేపట్టడం.

సమష్టి కృషితో ముందుకు..

జిల్లా కలెక్టర్ సూచనలతో ప్రతి నిత్యం గ్రామ స్థాయిలో పర్యవేక్షణ చేశాం. క్షేత్ర స్థాయిలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది సమన్వయంతో ముందుకెళ్లాం. జిల్లా, రాష్ట్ర స్థాయి స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పురస్కారాలను అందుకున్నాం. అదే ఉత్సాహంతో మరింత పారదర్శకంగా పనులు చేస్తాం.వీరబుచ్చయ్య, జిల్లా పంచాయతీ అధికారి, కరీంనగర్

# సాధారణ ప్రసవాలకే మొగ్గు

మెట్‌పల్లి: ప్రభుత్వ ఆసుపత్రుల్లో గతంలో శస్త్రచికిత్స ప్రసవాలే ఎక్కువగా జరిగేవి. సాధారణ ప్రసవాలు అరకొరగా చేసేవారు. ప్రభుత్వం సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని వైద్యాధికారులు, సిబ్బందిని ఆదేశించడంతో ఇప్పుడు పరిస్థితిలో కొద్దికొద్దిగా మార్పు వస్తోంది. ప్రభుత్వ ఆదేశాలతో సాధారణ ప్రసవాలపై దృష్టిసారిస్తున్నారు. అంతేకాకుండా సాధారణ ప్రసవాలు పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా పలు ఆసుపత్రుల్లో మిడ్‌వైఫరీ నర్సుల సేవలను ప్రారంభించింది. మొదటి కాన్పు కోసం వచ్చే గర్భిణులకు సాధారణ ప్రసవాలు జరిగేలా మిడ్‌వైఫరీ నర్సులు శారీరక వ్యాయామాలపై అవగాహన పెంపొందించాల్సి ఉంటోంది.

మెట్‌పల్లి పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి ప్రసవాల కోసం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి చాలా మంది వస్తుంటారు. ఆసుపత్రిలో ఇద్దరు గైనకాలజిస్టులు సేవలందిస్తున్నారు. ప్రభుత్వం తల్లీబిడ్డల సంక్షేమానికి కేసీఆర్ కిట్, అమ్మఒడి తదితర పథకాలు అమలు చేస్తుండడంతో చాలా మంది గర్భిణులు ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలకు మొగ్గు చూపుతున్నారు. గతంలో మెట్‌పల్లి ఆసుపత్రి ప్రసవాల్లో ముందంజలో నిలిచింది. 2018లో 2,268, 2019లో 2,533, 2020లో 2,421, 2021లో 2,065, 2022లో 2,140, ఈ ఏడాది ఇప్పటి వరకు 945 ప్రసవాలు జరిగాయి. ఇందులో 4,678 సాధారణ ప్రసవాలు ఉండగా, 11,698 శస్త్రచికిత్సలు ఉన్నాయి. అయితే ప్రభుత్వం సాధారణ ప్రసవాలపై దృష్టి పెట్టాలని వైద్యులను ఆదేశిస్తోంది. శస్త్రచికిత్సతో జరిగే కాన్పుల వల్ల భవిష్యత్తులో అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశముందని చెబుతున్నప్పటికీ, ప్రసవ సమయంలో వచ్చే నొప్పులు తాళలేక కొందరు, ముహూర్తం బాగుందని, ఇతరత్రా కారణాలతో మరికొందరు శస్త్రచికిత్సలు చేయాలని కోరుతున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి.

మిడ్‌వైఫరీ నర్సుల సేవలతో..

మెట్‌పల్లి ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో ప్రభుత్వం ముగ్గురు మిడ్‌వైఫరీ నర్సులను నియమించింది. వీరంతా మొదటి కాన్పు కోసం ఆసుపత్రికి వచ్చే గర్భిణులకు శారీరక వ్యాయామాలు చేయించాల్సి ఉంటోంది. నెలనెలా పరీక్షల కోసం వచ్చే గర్భిణులకు శారీరక



కసరత్తులు చేసే విధానంపై అవగాహన కల్పించి సాధారణ కాన్పుపై మొగ్గు చూపేలా చేయాలి. సరైన సమయంలో ప్రత్యేక వ్యాయామాలు చేయడం వల్ల శస్త్రచికిత్స అవసరం లేకుండా సాధారణ ప్రసవమయ్యేలా మేలు చేస్తాయని చెబుతున్నారు. మెట్‌పల్లి ఆసుపత్రిలో మూడు నెలలుగా వీరు సేవలందిస్తున్నారు. వీరు గర్భిణులకు శారీరక వ్యాయమాలు చేయించడంతో పాటు గైనకాలజీ వైద్యులు సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. దీంతో ఆసుపత్రిలో జూన్‌లో మొదటి కాన్పులో 42కు గాను 17, జులైలో 37కు గాను 13, ఆగస్టులో 36కు గాను 15 సాధారణ ప్రసవాలు జరిగాయి. ప్రభుత్వం మిడ్‌వైఫరీ నర్సుల సేవలు అందుబాటులోకి తీసుకొచ్చిన నేపథ్యంలో ప్రస్తుతం 35 నుంచి 40 శాతం వరకు జరుగుతున్న సాధారణ ప్రసవాలను మరింత పెంచేలా దృష్టిసారించాల్సిన అవసరముందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

శారీరక వ్యాయామంతోనే..

మెట్‌పల్లి సామాజిక ఆసుపత్రికి మూడు నెలల కిందట ముగ్గురు మిడ్‌వైఫరీ నర్సులను కేటాయించారు. మొదటి కాన్పుకోసం ఆసుపత్రికి వచ్చే గర్భిణులకు శారీరక వ్యాయామంపై అవగాహన కల్పిస్తున్నారు. ఆసుపత్రిలో మొదటి కాన్పులో జూన్‌లో 40 శాతం, జులైలో 35 శాతం, ఆగస్టులో 41 శాతం సాధారణ ప్రసవాలు జరిగాయి. ఈ సంఖ్య మరింత పెరిగేలా సేవలందిస్తాం.సాజిద్ అహ్మద్, మెట్‌పల్లి సామాజిక ఆసుపత్రి పర్యవేక్షకులు

# ఆయుష్మాన్ భవతో ఆరోగ్య ధీమా

మిర్యాలగూడ : గ్రామీణ ప్రాంతాల ప్రజలు వ్యాధుల బారిన పడి తమ విలువైన జీవితాలను కోల్పోకుండా ఆరోగ్యంగా జీవనం సాగించేలా దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం 'ఆయుష్మాన్ భవ' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కార్యక్రమంలో భాగంగా కార్డులు ఇవ్వటం, వైద్య పరీక్షలు, వ్యాధుల గుర్తింపు, రక్తదాన శిబిరాలు, అవయవదాన ప్రోత్సాహ శిబిరాలు, వ్యాధినిరోధక టీకాలు, టెలీ కన్సల్టేషన్, ఉచిత మందులు, జీవన శైలిలో మార్పులు, చేర్పులు వంటి కార్యక్రమాలు చేపట్టనున్నారు. దీన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ నెల 17 నుంచి అక్టోబరు 2 వరకు పక్షం రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టేలా ప్రణాళిక రూపొందించారు.

కార్యక్రమాలు ఇవీ..ఆయుష్మాన్ ఆప్కే ద్వార్-3.0 కార్యక్రమం ద్వారా ప్రతీ ఒక్కరికి ఆయుష్మాన్ కార్డులు అందిస్తారు.

ఆయుష్మాన్ మేళా పేరుతో వారంలో ఒకరోజు ఆరోగ్య మేళా ఏర్పాటు చేయనున్నారు. వీటిని సామాజిక ఆరోగ్య కేంద్రాలు, మెడికల్ కళాశాలలు, ప్రాంతీయ ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రుల్లో ప్రత్యేకంగా నిర్వహిస్తారు. ఇందులో గర్భిణులు, పిల్లలు, చెవి, ముక్కు, గొంతు, కన్ను, మానసిక విభాగం వంటి వాటిలో నిపుణులతో వైద్య పరీక్షలు చేస్తారు. ఇందులో అవయవదానంపై ప్రచారం నిర్వహిస్తారు. అవసరమైన వారికి 'టెలీ కన్సల్టేషన్' ద్వారా రోగుల సందేహాల నివృత్తికి అవకాశం కల్పిస్తారు.ఉమ్మడి జిల్లా పరిధిలో ఈనెల 22, 29 తేదీల్లో వైద్య కళాశాలల ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యులతో ఆరోగ్య మేళాలు నిర్వహించనున్నారు.'ఆయుష్మాన్ సభ' పేరుతో గ్రామస్థాయిలో అందరినీ సమావేశ పరిచి 'పోషణ కమిటీ'లతో గ్రామాల్లో ఆరోగ్య పథకాల గురించి అవగాహన కల్పిస్తారు. గ్రామాల్లో ఆయుష్మాన్ కార్డుల పంపిణీతో పాటు రక్త క్యాన్సర్, వ్యాధినిరోధక టీకాలు, టీబీ వంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల గుర్తింపుతో పాటు ఆయా వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు.అక్టోబరు 2న గాంధీ జయంతి పురస్కరించుకుని రక్తదాన శిబిరాలు ఏర్పాటుతో పాటు రక్త దాతల పేర్లను పోర్టల్‌లో నమోదు చేసి..ఎప్పుడైనా రక్తం అవసరముంటే వారికి సమాచారం అందించనున్నారు.

గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు

డాక్టర్ కల్యాణ్, ఆయుష్మాన్ భవ ప్రోగ్రాం అధికారి, సూర్యాపేట జిల్లానిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా అన్ని కార్యక్రమాలను కలిపి 'ఆయుష్మాన్ భవ' పేరుతో చేపట్టారు. ఇందులో గ్రామస్థాయిల్లో వార్డులో కూడా వైద్య పరీక్షలు చేసి దీర్ఘకాలిక సమస్యలు ఉన్నవారిని గుర్తించి వారికి వైద్యసేవలు అందిస్తారు. ఈ పక్షం రోజుల్లో కార్డులను పంపిణీ చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

# పెరిగిన వినియోగం.. విద్యుత్తు వ్యవస్థపై భారం

మిర్యాలగూడ : సాగర్ ఆయకట్టుతోపాటు విద్యుత్తు పంపుసెట్లతో సాగుచేస్తున్న ప్రాంతాల్లో విద్యుత్తు వినియోగం డిమాండ్ విపరీతంగా పెరుగుతోంది. వానా కాలమైనా వర్షాల జాడ లేకపోవడంతో సాగులో నీటి వనరులను సద్వినియోగం చేసుకోవడానికి రైతులు అత్యధికంగా విద్యుత్తు మోటర్లను వినియోగిస్తున్నారు. ఫలితంగా విద్యుత్తు ఉప కేంద్రంలోని నియంత్రికలపై భారం పడుతోంది. దూర ప్రాంతాలకు వెళ్లే లైన్లు లోడ్ తట్టుకోలేకపోతున్నాయి. నిత్యం బ్రేక్‌డౌన్‌లు, అంతరాయాలు ఏర్పడి సాగుకు సక్రమంగా విద్యుత్తు సరఫరా లేక పొలాలు వాడుపడుతున్నాయి. పరిస్థితి ఇలాగే ఉంటే పంటలు ఎండిపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురవడమో.. లేదంటే సాగర్ నీరు ఒక తడి వస్తేనే వేసిన పంట చేతికి వచ్చే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు.

వరుణుడి జాడలేక..వానాకాలంలో వర్షాలు దోబూచులాట ఆడుతుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఆరంభంలో ఒకసారి భారీగా వర్షం పడినా తర్వాత ముఖం చాటేశాయి. నెల రోజులకు అంటే ఈనెల మొదటి వారంలో భారీ వర్షం పడింది. దాంతో రైతులు బోర్లు, బావుల కింద ఎక్కువ విస్తీర్ణంలో నాట్లు వేశారు. ఆ తర్వాత వర్షం జాడ లేకపోవడంతో పొలాలు తడిసే పరిస్థితి లేదు. 24 గంటల విద్యుత్తు సరఫరా ఉంటుందని రెండు అంగుళాల నీరు పోసే బోర్ల కింద మూడు ఎకరాల వరకు నాట్లు వేశారు. వర్షం అడపాదడపా పడుతుంటే భూగర్భ జలాలు పెరగడంతో పాటు నీరు అంత అవసరం ఉండదని భావించి ముమ్మరంగా నాట్లు వేశారు. ఇప్పుడు వర్షం జాడ కన్పించడం లేదు.

అధికారులు సతమతం లోడ్ పెరుగుతుండటం, నిత్యం బ్రేక్‌డౌన్‌లు అవుతుండటంతో ఏం చేయాలో తెలియక విద్యుత్తు అధికారులు సతమతమవుతున్నారు. ఒకవైపు బిల్లుల వసూళ్లు, రీడింగ్‌ల నమోదు, గృహ వినియోగ సర్వీసుల సమస్యలు చూస్తూ వ్యవసాయానికి వచ్చే లైన్లు బ్రేక్‌డౌన్ అవుతుండటంతో అటూ ఇటూ పరుగెత్తలేక క్షేత్ర స్థాయి అధికారులు, సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. సిబ్బంది కొరతతో ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, కాస్త కరంటు గురించి తెలిసిన యువకులు సొంతంగా మరమ్మతులు చేసుకుంటున్నారు. లైన్లు బ్రేక్‌డౌన్ అయినపుడు సైతం విద్యుత్తు అధికారులకు సహకారం అందిస్తున్నారు. విద్యుత్తు మోటర్ల డిమాండ్‌కు అనుగుణంగా నియంత్రికలు ఏర్పాటుచేయడంతో పాటు సమస్య ఉన్న లైన్లలో మరమ్మతులు చేయడం, ఇన్సులేటర్లు మార్చడం వంటి పనులు చేపడితే కరంటు నిరంతరాయంగా ఇవ్వొచ్చని రైతులు పేర్కొంటున్నారు.

భారీగా పెరిగిన మోటార్ల వాడకం

సాగర్ ఎడమ కాల్వకు నీరు రాదనే కచ్చితమైన నిర్ణయానికి వచ్చిన రైతులు తమ పొలాలను కాపాడుకోవడానికి బోర్లు వేశారు. ఈ ఒక్క సీజన్‌లోనే 300కు పైగా బోర్లు వేసినట్లు అంచనా. అధికారికంగా అనుమతి లేకపోయినా పంటను కాపాడుకునేందుకు వాటికి మోటర్లు ఏర్పాటుచేసుకున్నారు. ఇప్పటికే ఉన్న వ్యవసాయ మోటర్లకే పరిమితమైన నియంత్రికల సామర్థ్యానికి కొత్తవి తోడవడంతో సబ్‌స్టేషన్లపై ఒత్తిడి పెరిగింది. ఫలితంగా అందులోని పరికరాలు కాలిపోతున్నాయి. పలు ఉప కేంద్రాలు లోడ్ తట్టుకోకపోవడంతో ఇప్పటికే అధిక సామర్థ్యమున్న పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటుచేశారు. అయినా లోడ్ పెరుగుతూనే ఉంది. వ్యవసాయ విద్యుత్తు వినియోగానికి తోడు ఎండల తీవ్రతకు రాత్రి, పగలు ఏసీలు వాడుతూనే ఉన్నారు. అటు గృహ, వ్యవసాయ వినియోగం పెరిగి నిత్యం అంతరాయాలు ఏర్పడుతున్నాయి. లైను తెగిపోవడం, కాలిపోవడం, నియంత్రికల వద్ద ఫ్యూజులు మాడిపోవడం సాధారణమవుతోంది. దీంతో వ్యవసాయానికి 18 గంటల కరంటు కూడా సక్రమంగా ఇవ్వలేకపోతున్నారు. కొన్ని ఫీడర్ల కింద 16 నుంచి 18 గంటల సరఫరా సాగుతున్నా అత్యధిక లోడు ఉన్న ఫీడర్ల కింద సరఫరా చేయలేకపోతున్నారు. నిత్యం అటూ ఇటూ మారుస్తుండటంతో రైతులకు పొలాలు తడవక రోడ్డెక్కుతున్నారు. విద్యుత్తు హెచ్చుతగ్గులు, బ్రేక్‌డౌన్లు కావడంతో మోటర్లపై ప్రభావం పడుతోంది. నిత్యం ఏదో ఒక మోటరు కాలిపోతుంది. స్టార్టర్లు, ఫ్యూజులు, మ్యాగ్నెట్లు, రిలేలు కాలిపోతున్నాయి.

భారమిలా..విద్యుత్తు వినియోగం గణనీయంగా పెరుగుతోంది. నాలుగు రోజుల వ్యవధిలోనే దాదాపు రెట్టింపు దశకు చేరింది.

# ఈసారి రంగంలోకి సీసీఐ

ఖమ్మం : కనీస మద్దతు ధరకు మించి ధరలు ఉండటంతో రెండేళ్ల నుంచి కొనుగోళ్లు చేపట్టని భారత పత్తి సంస్థ(సీసీఐ) ఈసారి సీజన్‌లో రంగంలోకి దిగే అవకాశం కన్పిస్తోంది. ఇటీవల సంస్థ వెలువరించిన మార్గదర్శకాల ప్రకారం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు స్పష్టమవుతోంది. దీనికి ప్రధాన కారణం కొన్ని నెలల నుంచి పత్తి ధరలు ఆశాజనకంగా లేకపోవటమే. భారత ప్రభుత్వ రంగ సంస్థ అయిన సీసీఐ దేశంలో పత్తి బహిరంగ మార్కెట్లో మద్దతు ధరకు సంబంధించి నోడల్ సంస్థగా వ్యవహరిస్తోంది.

ధరలను సవరించిన కేంద్ర ప్రభుత్వం

2023–24 సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వం పొడవు దూది పింజకు క్వింటాకు 10 శాతం, మధ్యస్థ దూది పింజకు 9 శాతం కనీస మద్దతు ధరపై పెరుగుదలను సూచించింది. ప్రస్తుత పరిస్థితులు గమనిస్తే మార్కెట్లో కనీస మద్దతు ధర లభించే అవకాశం కనిపించడం లేదు. అక్టోబరు 23 నుంచి మే 24 వరకు పత్తి సీజన్ ఉంటుందని అంచనా. కనీస మద్దతు ధర కార్యకలాపాలు సాఫీగా సాగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సీసీఐ భావిస్తోంది.

సీజన్ నాటికి మరింత తగ్గే అవకాశం

ఖమ్మం జిల్లాలో ఖమ్మం, మద్దులపల్లి, నేలకొండపల్లి, మధిర, వైరా, ఏన్కూరు, కల్లూరు, సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్లు ఉన్నాయి. భద్రాద్రి జిల్లాలో ఇల్లెందు, కొత్తగూడెం, బూర్గంపాడు, భద్రాచలం, చర్ల,



దమ్మపేట మార్కెట్లు ఉన్నాయి. తెలంగాణలోనే పత్తికి పేరుగాంచిన ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో ఎక్కువగా కొనుగోళ్లు జరుగుతాయి. ప్రస్తుతం విపణిలో పాత పత్తి క్వింటా గరిష్ఠ ధర రూ.7,300 కనీస మద్దతు ధరకు మించి కొంతవరకు ఉన్నప్పటికీ, కొత్త పత్తి సీజన్ వచ్చే నాటికి ఈ ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని సీసీఐ అంచనా వేస్తోంది. దీనివల్ల రైతులకు కనీస మద్దతు ధర లభించే అవకాశం ఉండదు. అందుకే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీసీఐ యోచిస్తోంది.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది...ఎంఏ అలీం, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి, భద్రాద్రి కొత్తగూడెం

సీసీఐ కొనుగోలు కేంద్రాలకు సంబంధించి ఇంత వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. కొద్దిరోజుల్లో వీటి విషయంపై స్పష్టత వచ్చే అవకాశముంది. రాష్ట్ర మార్కెటింగ్ శాఖ నుంచి వచ్చిన ఉత్తర్వుల ప్రకారం పత్తి కొనుగోళ్లకు ఉపక్రమిస్తాం.

# నిలిచిన విజయ పాల సరఫరా

ఖమ్మం : ప్రభుత్వ రంగ సంస్థ విజయ డెయిరీ ద్వారా ఐదు రోజుల నుంచి జిల్లాలో పాల సరఫరా నిలిచిపోయింది. విద్యార్థులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సరఫరా చేసే గుత్తేదారు లేకపోవడంతో ఇలాంటి పరిస్థితులు నెలకొన్నాయి. ఇక్కడి పాలను జిల్లా అధికారులు నేరుగా రాష్ట్ర పాడిపరిశ్రమ సమాఖ్య (హైదరాబాద్)కు తరలిస్తున్నారు. కొన్ని నెలల నుంచి ఇక్కడ సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ అధికారులు పరిష్కరించకపోవటంతో మరింత జటిలంగా మారింది.

చేతులెత్తేసిన పాత గుత్తేదారు

గతేడాది సూరజ్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థకు చెందిన గుత్తేదారు డెయిరీ నుంచి జిల్లావ్యాప్తంగా పాలను సరఫరా చేశారు. జులై 14తో గడువు ముగిసింది. టెండర్లు నిర్వహించకపోవడంతో కొత్తగా గుత్తేదారులెవరూ రాలేదు. సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు, వినియోగదారులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు అతడితోనే కొంతకాలం పాటు సరఫరా చేయించారు. ఈనెల 16న తాను పాలను సరఫరా చేయలేనని సదరు గుత్తేదారు చేతులెత్తేశారు.

జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి

జిల్లాలో మొత్తం ఆరు పాల రూట్లు ఉన్నాయి. సత్తుపల్లి, ఎర్రుపాలెం, బోనకల్లు, ఖమ్మం నగరం, నేలకొండపల్లి, ఇల్లెందు రూట్లలో పాలను సరఫరా చేయాల్సి ఉంటుంది. వీటితో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ వసతి గృహాలు, జిల్లా జైలు సహా మొత్తం 63 సంస్థలకు రోజుకు సుమారు 3,500 లీటర్లు రవాణా చేయాలి. ఒక్క ఖమ్మం నగరంలోనే 10 విజయ డెయిరీ పార్లర్లు ఉన్నాయి. వందల సంఖ్యలో చిరు వ్యాపారులకు సరఫరా చేస్తున్నారు. ఇప్పుడు పాల సరఫరా



నిలిచిపోవటంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

టెండర్ల నిర్వహణలో జాప్యం

ఇప్పటికే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సరఫరా చేస్తున్న ఎస్ఆర్ ఏజెన్సీస్, స్వాతి ఏజెన్సీస్, సతత ఏజెన్సీలు.. పాలను సరఫరాకు దరఖాస్తు చేసుకున్నాయి. వీటిపై రాష్ట్ర అధికారులు ఇంతవరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. టెండర్లను పిలవడంలో జాప్యం జరుగుతుండటంతో ఇక్కడ ఇబ్బంది కలుగుతోంది.

నాలుగు రోజుల్లో సమస్య పరిష్కారం

ఎ.కుమారస్వామి, ఉప సంచాలకుడు, విజయ డెయిరీ, ఖమ్మం

గుత్తేదారు లేకపోవటంతో ప్రస్తుతం పాల సరఫరా నిలిచిపోయింది. దీని ద్వారా సంక్షేమ వసతిగృహాల్లోని విద్యార్థులు, ఇతర వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని కలెక్టర్, అదనపు కలెక్టర్, రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నాలుగురోజుల్లో సమస్య పరిష్కారమవుతుంది.

# జాగ పేరిట దగా..!



కొత్తగూడెం : ప్రజావసరాలు తీర్చాల్సిన ప్రజాప్రతినిధులు రాబందులుగా మారుతున్నారు. ప్రభుత్వ పథకాలను అడ్డుగా పెట్టుకుని రూ.లక్షలు దండుకుంటున్నారు. పేదోళ్లను సైతం డబ్బుల కోసం పిండేస్తున్నారు. కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఇళ్లు లేని నిరుపేదలకు ప్రభుత్వ స్థలాలు కేటాయించేందుకు గతనెలలో కలెక్టరేట్లో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. 977 దరఖాస్తులు రాగా లబ్ధిదారులకు పాతకొత్తగూడెంలోని ప్రభుత్వ స్థలంలో 75 గజాల చొప్పున స్థలం పంపిణీ చేసేందుకు సన్నద్ధమయ్యారు. ఎస్సీ, ఎస్టీలను నేరుగా, మిగతా సామాజికవర్గాల వారిని లక్కీడ్రా ద్వారా మొత్తమ్మీద 800 మందిని ఎంపిక చేశారు.

75 గజాల స్థలం దక్కేలా లాటరీలో పేరు వస్తుందంటూ ఎస్టీ మహిళతో కొత్తగూడెంలోని ఓ వార్డు కౌన్సిలర్ భర్త అనుచరుడు రూ.లక్ష బేరమాడాడు. అంత ఇచ్చుకోలేనంటూ ఆమె ప్రాధేయపడటంతో నేరుగా కౌన్సిలర్ భర్తతో మాట్లాడుకోమన్నాడు. చివరికి రూ.30వేలకు ఒప్పందం కుదిరింది. వాస్తవానికి ఎస్టీ మహిళకు లాటరీ విధానం లేకుండానే నేరుగా వచ్చిన స్థలానికి బేరం కుదుర్చుకోవటం గమనార్హం.

వసూళ్లలో ఘనుడిగా పేరొందిన మరో మహిళా కౌన్సిలర్ భర్త తమ వార్డులోని లబ్ధిదారులతో రూ.లక్షన్నర చొప్పున బేరమాడాడు. బతిమిలాడుకుంటే చివరికి రూ.లక్షకు ఒప్పుకొన్నాడు.

లబ్ధిదారులతో బేరసారాలు

లబ్ధిదారుల జాబితా ముందస్తుగానే కౌన్సిలర్లకు చేరడంతో వాటి ఆధారంగా బేరసారాలాడారు. ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష– 1.50 లక్షల వరకు డిమాండ్ చేశారు. కొందరు మహిళా కౌన్సిలర్ల భర్తలు నేరుగా లబ్ధిదారులతో బేరాలాడితే మరికొందరు తమ అనుచరులతో మంతనాలు సాగించారు. 'స్థలం వచ్చేలా చేస్తా.. కాకపోతే రూ.లక్ష ఇవ్వాల్సిందే'నని ఓ మహిళా కౌన్సిలర్ భర్త తెగేసి చెప్పారు. సదరు వ్యక్తి దళితబంధు పథకంలోనూ సగానికి సగం వసూలు చేశారనే ఆరోపణలున్నాయి. కొందరు ప్రతిపక్ష కౌన్సిలర్లు సైతం ఇదేబాటలో సాగుతుండటం గమనార్హం. డబ్బులు ఇవ్వకపోతే జాబితాలో పేరున్నా స్థలం దక్కదేమోననే ఆలోచనతో కొందరు లబ్ధిదారులు శక్తికి మించి అప్పు చేయాల్సిన పరిస్థితి దాపురించింది. కొత్తగూడెం పురపాలికలోని 36 వార్డుల్లో ఎస్సీ, ఎస్టీలకు స్థితిగతులను బట్టి నేరుగా ప్రభుత్వ స్థలం కేటాయించాలని అధికారులు నిర్ణయించారు. ఈ విషయంపై అవగాహన లేకపోవడంతో లాటరీలో తమ పేరు రావాలంటూ ప్రజాప్రతినిధులు అడిగినంత ఇచ్చేందుకు కొందరు లబ్ధిదారులు యత్నించటం విచారకరం. పేదలకు ప్రభుత్వ స్థలం ఉచితంగా కేటాయించే ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాం. లాటరీలో ఎంపికైన వారిపేరు, కేటాయించిన ప్లాటు నంబర్లను నోటీసు బోర్డులో ప్రదర్శించాం. ఎస్సీ, ఎస్టీలకు చెందిన వారిని నేరుగా ఎంపిక చేశాం. లబ్ధిదారులు ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేదు. ఎవరైనా డబ్బులు అడిగితే నేరుగా మాకు ఫిర్యాదు చేయాలి. జాబితాలో చోటుదక్కిన వారందరికీ త్వరలో పట్టాలు అందజేస్తాం.పుల్లయ్య, తహసీల్దారు, కొత్తగూడెం

# ముఖ ఆధారిత హాజరుకు ముస్తాబు..!




కొత్తగూడెం : సర్కారు బడుల్లో విద్యార్థుల హాజరును పారదర్శకంగా నమోదు చేసే ప్రక్రియ ఉభయ జిల్లాల్లో శరవేగంగా కొనసాగుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరును అంతర్జాలంలో నమోదు చేసి, ఎటువంటి అవకతవకలకు వీలు లేకుండా ఇందుకోసం ముఖ గుర్తింపు ఆధారిత డీఎస్‌సీ 'ఎఫ్ఆర్ఎస్' (ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టం) యాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్ సాయంతో విద్యార్థుల రోజువారీ హాజరు నమోదవనుంది. ఇప్పటికే ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని డీఈఓ కార్యాలయాల నుంచి ఆదేశాలు రావడంతో యుద్ధప్రాతిపదికన యాప్ సాయంతో హాజరు కోసం సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల చిత్రాలను యాప్‌లో నిక్షిప్తపరచాల్సి ఉండగా, సాంకేతిక, ఇతర కారణాలతో కాస్త ఆలస్యం అవుతోంది. ప్రధానంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.ముఖ గుర్తింపు ఆధారిత హాజరు నమోదుపై డీఈఓ కార్యాలయ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

గతంలో కొన్ని ప్రాంతాల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పర్యవేక్షించేందుకు బయోమెట్రిక్ విధానం ఉండేది. కొవిడ్ కారణంగా బయోమెట్రిక్ నిలిచిపోవడంతో నూతనంగా యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. గూగుల్ ప్లే స్టోర్ నుంచి యాప్ డౌన్‌లోడ్ చేసుకొని పాఠశాల 'యుడైస్' కోడ్‌ను యూజర్ ఐడీగా '%school%@123µ పాస్వర్డ్ లాగిన్ అయితే చాలు.. యాప్ సర్వీస్‌లోకి వస్తుంది. ప్రభుత్వ, జిల్లా పరిషత్, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు, గురుకులాలు, ఆదర్శ, మోడల్ స్కూల్‌లలో యాప్ ద్వారా హాజరుకు సిద్ధం అవుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో యాప్ ద్వారా హాజరుకు ఆసక్తి చూపించడం లేదు. ప్రధానంగా మారుమూల అటవీప్రాంతాల్లో సరైన సిగ్నల్ లేకపోవడంతో పాటు కొన్ని పాఠశాలల్లో ఒకరు, ఇద్దరు మాత్రమే విద్యార్థులున్నారు. ఇలాంటి చోట యాప్ రిజిస్ట్రేషన్‌పై మార్గదర్శకాలు ఎలా ఉండబోతాయనే ఆసక్తి నెలకొంది. అన్ని తరగతులకు యాప్ ద్వారా హాజరు నమోదు నూరుశాతం చేయాల్సిందేనని సంబంధిత అధికారులు చెబుతున్నారు. రానున్న రోజుల్లో విద్యార్థుల మధ్యాహ్న భోజనం, ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు, ఇతర కార్యక్రమాలకు యాప్ ఎంతో ఉపయోగపడుతుంది. మరికొన్ని రోజుల్లో ఉపాధ్యాయుల హాజరు నమోదుకూ కార్యాచరణ రూపొందిస్తున్నారు. మారుమూల ప్రాంతాల్లో రిసోర్స్ పర్సన్లు లేకపోవడంతో పాటు బదిలీ, ఉద్యోగోన్నతుల నేపథ్యంలో పూర్తిస్థాయిలో యాప్ రూపకల్పన జరగడం లేదు.ప్రస్తుతం కొనసాగుతున్న విద్యార్థుల హాజరుతో కొంత ఇబ్బందులు ఉన్నాయి. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ముఖ గుర్తింపు పద్ధతిలో హాజరు నమోదు అందుబాటులో తీసుకొచ్చింది. యాప్ ద్వారా హాజరు శాతాన్ని పెంచుకొనే వెసులుబాటు ఉంటుంది. యాప్ సేవలు అన్ని రకాల పథకాలు, కార్యక్రమాలకు ఉపయోగపడుతున్నాయి. మరికొన్ని రోజుల్లో హాజరు ప్రక్రియ ప్రారంభం కానుంది. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాల్సిందేనని ఆదేశించాం. సోమశేఖరశర్మ, డీఈఓ, ఖమ్మం

# 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణే లక్ష్యం

ఖమ్మం : జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్(2023–24)లో 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని పౌరసరఫరాల సంస్థ అధికారులు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు. వ్యవసాయ శాఖ నివేదిక ప్రకారం జిల్లావ్యాప్తంగా 1,17,409 హెక్టార్లలో రైతులు వరి పంట సాగు చేస్తున్నారని, 6.67 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని లెక్కించారు. ఈ నివేదిక ఆధారంగా ఇటీవల కలెక్టర్ నిర్వహించిన సమావేశంలో పౌరసరఫరాల సంస్థ ద్వారా 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. నవంబరు రెండో వారం నుంచి ధాన్యం మార్కెట్‌కు వస్తుందని అంచనా వేశారు. ధాన్యం సేకరణకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, గోనె సంచులు సిద్ధం చేయడం, తేమ శాతం పరీక్షించే యంత్రాలు, టార్పాలిన్లు, ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు, ఇతర పరికరాలు సమకూర్చడం తదితర అంశాలపై అధికారులు కసరత్తు చేస్తున్నారు.


236 కొనుగోలు కేంద్రాలు

వానాకాలంలో ధాన్యం కొనుగోలుకు 236 కేంద్రాలు ఏర్పాటుచేయాలని ప్రతిపాదించారు. ఐకేపీ 50, పీఏసీఎస్ 152, డీసీఎంఎస్ 30, ఏఎంసీల్లో 4 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. సేకరించిన ధాన్యం మర పట్టేందుకు 57 రా రైస్ మిల్లులు, 7 పార్‌బాయిల్డ్ రైస్ మిల్లులను ఎంపిక చేశారు.

ముందస్తు ఏర్పాట్లు

మధుసూదన్‌నాయక్, అదనపు కలెక్టర్

వానాకాలంలో రైతులు పండించిన ధాన్యం కొనుగోలుకు ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రాథమికంగా 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని నిర్ణయించాం. రైతుల బ్యాంకు ఖాతాలకు 24 గంటల్లో



నగదు జమయ్యేలా చర్యలు తీసుకుంటాం. నవంబరు రెండో వారంలో మార్కెట్‌కు ధాన్యం వస్తుందని అంచనా.

కావాల్సిన గోనె సంచులు: 1.25 కోట్లు

అందుబాటులో ఉన్నవి: 57,71,492

ఇంకా కావాల్సినవి: 72,60,173

జిల్లాలో 19 ప్రదేశాల్లోని గోదాముల్లో గోనె సంచులు అందుబాటులో ఉన్నాయి.జిల్లాలోని 12 గోదాముల్లో 78389 మెట్రిక్ టన్నులు నిల్వ చేయగల ఖాళీ ప్రదేశం అందుబాటులో ఉంది.టార్పాలిన్లు 7020 కావాల్సి ఉండగా 6332 ఉన్నాయి.ధాన్యం సేకరణలో పాల్గొనే సిబ్బందిని గుర్తించి వారికి శిక్షణ అందించనున్నారు.

# పశువుల సంచారం.. ప్రాణ సంకటం

భూపాలపల్లి : భూపాలపల్లిలో జాతీయ రహదారితోపాటు ఇతర ప్రధాన రోడ్లపై పశువులు యథేచ్ఛగా తిరగడమే కాకుండా, వాటిపైనే సేద తీరడంతో వాహన ప్రమాదాలు నిత్యకృత్యం అవుతున్నాయి. వేగంగా వచ్చే పెద్ద పెద్ద వాహనాలు తగిలి మూగ జీవాలు మృత్యువాత పడుతున్నాయి. ఇలాంటి ప్రమాదాలు తరచూ ఎక్కడో ఒకచోట జరుగుతూనే ఉన్నాయి. భూపాలపల్లి నుంచి గణపురం మండలం చెల్పూరు వరకు సెంట్రల్ లైటింగ్, మధ్యలో ఏర్పాటు చేసిన డివైడర్ల మధ్యలో కూడా మొక్కలు పెంచడంతో వాటి నీడకు పశువులు చేరి సేద తీరుతున్నాయి. భూపాలపల్లి పట్టణంలో గణేష్ చౌక్ నుంచి జంగేడు, కాశీంపల్లి రహదారి, అంబేడ్కర్ కూడలి నుంచి సుభాష్‌కాలనీ, కృష్ణాకాలనీ వరకు గల రహదారులపై పశువుల సంచారం ఉంటోంది. గుంపులు గుంపులుగా రోడ్డుపై తిరుగుతున్నాయి. కేటీకే 1, 5, 6, 8వ ఇంక్లైయిన్‌లోని రోడ్ల పైన కూడా పశువులు తిష్టవేయడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

మచ్చుకు కొన్ని..

పట్టణంలోని గణేష్ చౌక్ ప్రాంతంలో నాలుగు రోజుల క్రితం పశువులు గుంపు జాతీయ రహదారిపై తిరుగుతున్న క్రమంలో అందులోని రెండు పశువులు ఒకదానిని మరొకటి పొడుచుకుంటూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో పక్కనే ఉన్న ఇద్దరు యువకులు గాయపడ్డారు.

పట్టణంలోని సుభాష్‌కాలనీ ప్రాంతంలోని రామాలయం సమీపంలో రహదారిపై పశువులు సేద తీరడంతో రెండేళ్ల క్రితం ఉదయం పూట ద్విచక్ర వాహనంపై అంబేడ్కర్ కూడలి వైపు వస్తున్న సుభాష్‌కాలనీకి చెందిన యువకుడు ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి, పశువులను ఢీకొట్టి అక్కడికక్కడే మృతిచెందాడు.

పట్టణంలోని సీఆర్‌నగర్ కాలనీ ప్రాంతంలోని కేటీకే 6వ గని రహదారి ప్రాంతంలో ఆరు నెలల క్రితం ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకునేందుకు ద్విచక్ర వాహనంపై వచ్చిన స్థానిక కాకతీయ కాలనీకి చెందిన ఓ యువకుడు పశువులను ఢీకొట్టడంతో తలకు బలమైన గాయం తగిలింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

వర్షానికి తడిసిన రోడ్లపై నిర్ణీత వేగంతో మాత్రమే ప్రయాణించాలి. అకస్మాత్తుగా బ్రేకులు వేయొద్దు. ఇలా చేస్తే చక్రాలు జారి వాహనం అదుపుతప్పే ప్రమాదం ఉంది. డూమ్ లైట్ సరిగా ఉండేలా చూసుకోవాలి. పశువులు ఉన్నట్లు గుర్తిస్తే 50 మీటర్ల ముందే వేగం తగ్గించి బ్రేకులు వేసుకోవాలి. కార్లు, ఇతర వాహనాలను డివైడర్ల పక్క నుంచే కాకుండా రహదారి మార్జిన్ సరిచూసుకుంటూ నడపాలి. వైపర్లు సరిగా పనిచేసేలా చూసుకోవాలి. వాహన బ్రేకులు కండిషన్‌లో ఉంచుకోవాలి. ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలి. పశువుల పక్కన నుంచి వెళ్లేటప్పుడు జాగ్రత్తగా నడపాలి. లేదంటే అవి బెదిరి మీదపడే ప్రమాదం ఉంటుంది.

అధికారులు దృష్టి పెట్టాలి..

రహదారులపై పశువుల సంచారాన్ని నిలువరించేందుకు పురపాలక అధికారులు చేసిన ప్రకటనలు ఆచరణలోకి రావడం లేదు. సిబ్బంది పెద్దగా పట్టించుకోవడం లేదని అర్థమవుతోంది. వర్షాలు కురిసిన సమయంలో పశువులు రోడ్లపైన సంచరిస్తుండటంతో ప్రమాదాలకు ఆస్కారం ఎక్కువగా ఉన్నందున రోడ్లపై పశువుల సంచారాన్ని నియంత్రించేందుకు అధికారులు దృష్టి పెట్టాలి. ముఖ్యంగా పశువులను స్థానిక బందెల దొడ్లకు తరలించేలా చర్యలు తీసుకోవాలి. పశువుల పెంపకందారులను గుర్తించి, వారికి నోటీసులు జారీ చేయాలి. ఆ తర్వాత వారు వినిపించుకోకుంటే పశువులను దూరప్రాంతాల్లోని గోశాలకు తరలించారు.

# అందని బిల్లులు.. అప్పులతో తిప్పలు

జనగామ : ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు అస్తవ్యస్తంగా మారింది. పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి పెడుతున్న నిర్వాహకులకు కొన్ని నెలలుగా బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏజెన్సీ మహిళలు అప్పులు తెచ్చి పిల్లల ఆకలి తీర్చుతున్నారు.

**పెరిగిన ధరలతో అవస్థలు..** నిత్యావసర సరకుల ధరలు పెరగడంతో నిర్వాహకులు ఆర్థికభారంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే దాని కంటే వెచ్చించే ఖర్చులే ఎక్కువగా ఉంటున్నాయి. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.4.97 (గుడ్డుతో కాకుండా), ప్రాథమికోన్నత పాఠశాల లో ఒక్కొక్కరికి రూ.8.17 (గుడ్డు మినహాయించి) చొప్పున, 9, 10 తరగతుల్లో ఒక్కో విద్యార్థికి గుడ్డుతో కలుపుకొని రూ.10.67 వంతున చెల్లిస్తున్నారు. గత రెండేళ్లుగా నిత్యావసరాలు, కూరగాయలు, వంట గ్యాస్ ధరలు భారీగా పెరిగాయి. ప్రస్తుత ధరలతో పోలిస్తే ప్రభుత్వం ఇచ్చే నిధులు సరిపోవడం లేదని నిర్వాహకులు వాపోతున్నారు. అప్పులు చేసి వంట చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలతో సతమతం..!

ప్రభుత్వం నుంచి సకాలంలో నిధులు రావడం లేదు. ఇచ్చే అరకొర వేతనాలు కూడా సమయానికి అందడం లేదు. మరోవైపు నిర్వాహకులు భోజనం తయారీకి దొరికిన చోటల్లా అప్పులు చేశారు. తెచ్చిన అప్పులు, సరుకులపై వ్యాపారులు వడ్డీలు వేస్తున్నారు. దీంతో వాటిని చెల్లించడం పెద్ద సమస్యగా మారింది. రోజూ కూలి పనులకు వెళ్తే రూ.500 వరకు వస్తుంటే.. కేవలం రూ.1000 వేతనానికి పని చేయడం కష్టంగా మారిందని, కిచెన్ షెడ్లు లేక ఆరుబయటే కట్టెలపొయ్యి మీద వంట చేయడంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వాపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా నాలుగు నెలలకు సంబంధించి లక్షలాది రూపాయల భోజన బిల్లుల బకాయిలు రావాల్సి ఉంది. ఎన్ని ఇబ్బందులున్నా పిల్లల కడుపు మాడ్చకుండా భోజనం పెడుతున్న నిర్వాహకులకు బిల్లులు త్వరగా విడుదల చేయాలని విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాల నేతలు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి

జనగామలోని ఓ ఉన్నత పాఠశాలలో 380 మంది విద్యార్థులకు ముగ్గురు నిర్వాహకులు వంట చేస్తున్నారు. ఇందు కోసం నెలకు సుమారు రూ.50వేలకు పైగా ఖర్చవుతోంది. కానీ ప్రభుత్వం నుంచి మాత్రం నెలకు రూ.40 వేల నుంచి రూ.45 వేల వరకు బిల్లులు వస్తుండడంతో నిర్వాహకులు నష్టపోతున్నారు.

మరో ప్రాథమిక పాఠశాలలో ఆరుగురు విద్యార్థులకు భోజనం వండి పెడుతున్న నిర్వాహకురాలికి రోజుకు సుమారు రూ.200 చొప్పున లెక్కిస్తే ఆమెకు రూ.50 కూడా బిల్లు రావడం లేదు.

పాలకుర్తి, రఘునాథపల్లి, తరిగొప్పుల మండలాల్లోని కొన్ని పాఠశాలల్లో వంట భారంగా మారడంతో నిర్వాహకులు వంట చేసేందుకు విముఖత చూపుతున్నట్లు సమాచారం.

అప్పులు తెచ్చి వంట చేస్తున్నాంఆదిలక్ష్మి, వంట నిర్వాహకురాలు, జనగామమూడు నెలలుగా మధ్యాహ్న భోజనం బిల్లులు ఇవ్వడం లేదు. ఇచ్చే బిల్లులను కూడా సకాలంలో అందించకపోవడంతో అప్పులు తెచ్చి పిల్లలకు భోజనం పెట్టాల్సి వస్తోంది.

# ఒక్క పరీక్ష.. జీవితానికి రక్ష

ఖమ్మం : ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పని చేస్తున్న ఉద్యోగికి ఇద్దరు ఆడపిల్లలు. ఆరోగ్యంగా ఉన్నారు. మూడో సంతానంలో బాబు పుట్టాడు. ఆరు నెలల వయసులోనే రక్తహీనతతో బాధపడుతున్నాడు. వైద్యులను సంప్రదించగా పరీక్షలు చేయించారు. చిన్నారికి తలసీమియా ఉన్నట్లు నిర్ధారణైంది. బాబుకు నిత్యం రక్తం ఎక్కించాల్సిన పరిస్థితుల్లో తల్లిదండ్రులు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. కామేపల్లి మండల పరిధిలోని ఓ తండాకు చెందిన దంపతులు వ్యవసాయ కూలీలు. వారికి ఇద్దరు పిల్లలు. మొదటి సంతానం పాప ఆరోగ్యంగా ఉంది. రెండో సంతానం బాబు. కుమారుడు ఏడేళ్ల వయసులో రక్తహీనత, శరీర నొప్పులతో బాధపడుతున్నాడని తెలిసి వైద్యులను సంప్రదించగా హెచ్‌బీ ఏ2 పరీక్షలు చేయించారు. సికిల్‌సెల్ ఎనీమియా ఉన్నట్లు గుర్తించారు.

..ఇటువంటి బాధిత కుటుంబాలు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వందల సంఖ్యలో ఉండటం ఆందోళన కలిగించే అంశం. ఏటా 5-10 కొత్త కేసులు వెలుగులోకి వస్తున్నాయి.

తలసీమియా, సికిల్‌సెల్ ఎనీమియా నివారణకు జన్యుపరమైన పరీక్షలు చేయించుకోవడం తప్పనిసరని నిపుణులు సూచిస్తున్నారు. హిమోగ్లోబిన్ సమస్యలను గుర్తించే హెచ్‌బీ ఏ2 పరీక్ష ద్వారా వాటిని నిర్ధారించవచ్చు. పుట్టుకతో వచ్చే ఈ జబ్బుల కారణంగా బాధితులకు నెలకు కనీసం ఒకటి, రెండుసార్లు రక్తం ఎక్కించాల్సి ఉంటుంది. సకాలంలో రక్తం స్వీకరించకుంటే ప్రాణాలకే ప్రమాదం. భద్రాద్రి ఏజెన్సీ ప్రాంతాల్లో వ్యాధిగ్రస్థులు ఎక్కువ మంది ఉంటున్నారు. అభంశుభం తెలియని



వయసులో చిన్నారులు రుగ్మతల బారినపడుతున్నారు. ప్రభుత్వ విభాగాల వద్ద బాధితుల వివరాలు లేకపోవడం గమనార్హం. ఒక్క రక్త పరీక్షతో వాటిని నివారించే అవకాశం ఉన్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో దాని ప్రభావం పుట్టబోయే పిల్లలపై పడుతోంది.

ముందస్తు పరీక్షలతో అడ్డుకట్ట..

తలసీమియా, సికిల్ సెల్ ఎనీమియా జన్యు సంబంధమైన వ్యాధులు. ఎముక మూలుగలో ఎర్ర రక్తకణాల ఉత్పత్తి నిలిచిపోవడాన్ని తలసీమియాగా గుర్తిస్తారు. వారసత్వ రుగ్మతల్లో సికిల్ సెల్ ఎనీమియా ఒకటి. ఈ వ్యాధులకు మేనరిక వివాహాలే ఎక్కువ కారణమని నిపుణులు చెబుతున్నారు. తల్లిదండ్రులు ఇద్దరూ కారకులుగా ఉంటే ఈ వ్యాధులొస్తాయి. వివాహం చేసుకోబోయే జంటలు నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది. జిల్లా సర్వజన ఆస్పత్రిలో ఈ పరీక్షలను ఉచితంగానే చేస్తారు. కానీ ఎవరూ ముందుకు రావడం లేదు. వివాహానికి ముందు యువ జంటలు ఈ దిశగా ఆలోచించాలి. లేదంటే భవిష్యత్తులో పిల్లలు ఆయా వ్యాధులతో సతమతమవుతున్నారని తెలిసి జీవితాంతం బాధపడాల్సిందే.

గర్భస్థ దశలోనూ తేలుతుంది

గర్భస్థ దశలో ఈ వ్యాధులకు సంబంధించిన పరీక్షలు చేయించుకోవాలి. వైద్య ఆరోగ్యశాఖ తరపున గత ఏడాది నవంబరులో రక్తహీనత ఉన్న గర్భిణులకు హెచ్‌బీ ఏ2 పరీక్షలు చేయించారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో 2457 మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేయగా 116 మందిలో క్యారియర్ లక్షణాలు ఉన్నట్లు తేల్చారు. క్యారియర్స్‌గా తేలిన గర్భిణుల భర్తలకు పరీక్షలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఇద్దరూ వాహకులు అని తేలితే పుట్టబోయే పిల్లలకు తప్పనిసరిగా వ్యాధులు సోకే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

ప్రభుత్వ సాయం అరకొరే..

ప్రభుత్వం దివ్యాంగులుగా గుర్తిస్తూ 2018లో ఉత్తర్వులు విడుదల చేసినా నేటికీ లబ్ధిదారులకు ఆసరా పింఛన్లు అందడం లేదు. ఇతర సౌకర్యాలకు నోచుకోవడం లేదు. సంకల్ప స్వచ్ఛంద సంస్థ, తలసీమియా సికిల్ సెల్ సొసైటీ కృషితో వ్యాధిగ్రస్థులను ఆరోగ్యశ్రీలో చేర్చారు. తెల్ల రేషన్‌కార్డు ఉన్న లబ్ధిదారులకు మాత్రమే రవాణా ఖర్చులు, ఔషధాల కింద నెలకు ఒక్కొక్కరికి రూ.13 వేలు చొప్పున అందజేస్తున్నారు. కేవలం 125 మందికి మాత్రమే లబ్ధి చేకూరుతుంది. సికిల్ సెల్ బాధితులకు మాత్రం రక్తం ఎక్కించే సమయంలోనే వాటిని చెల్లిస్తారు. ఇందుకు అవసరమైన లుకోసెట్(ఫిల్టర్) పరికరాన్ని మాత్రం సరఫరా చేయడం లేదు.

## అరకొరగానే అభ్యసన సామర్థ్యాలు

సిరిసిల్ల : ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సర్కారు బడులను తీర్చిదిద్దుతుంది. ఆంగ్ల మాధ్యమం అమలుతోపాటు మౌలిక వసతులు కల్పిస్తోంది. అయినప్పటికీ విద్యా ప్రమాణాలు మాత్రం భిన్నంగా ఉంటున్నాయి. విద్యార్థుల సామర్థ్యాలు పెరగడం లేదు. చదవడం, గణితం చతుర్విధ ప్రక్రియల్లో వారి ప్రగతి అంతంతమాత్రంగానే ఉంటోంది. ఇందుకు ఇటీవల విడుదల చేసిన జాతీయ సాధన సర్వే ఫలితాలే నిదర్శనం.చదవడం, రాయడం, గణితంలో విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం తొలిమెట్టు కార్యక్రమాన్ని ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు చేస్తోంది. 2021 నవంబర్ 12న దేశవ్యాప్తంగా ఒకే రోజు సర్వే పరీక్ష నిర్వహించారు. జిల్లాలో ఎంపిక చేసిన 168 పాఠశాలల్లో 3, 5, 8, 10 తరగతుల విద్యార్థులకు తెలుగు, ఆంగ్లం గణితంలో అభ్యసన సామర్థ్యాలపై పలు ప్రశ్నల ద్వారా సర్వే చేపట్టారు. సంబంధిత సర్వే ఫలితాలను ఇటీవల విడుదల చేశారు. జిల్లాలోని విద్యార్థుల సామర్థ్యాలు 60 శాతంలోపే ఉన్నాయి. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల స్థాయిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. జాతీయ సాధన సర్వే వెల్లడించిన వివరాల ప్రకారం జిల్లాలోని సర్కారు బడుల్లో విద్యార్థుల సామర్థ్యాలు అరకొరగానే ఉన్నట్లు వెల్లడైంది. కరోనా కారణంగా రెండేళ్లపాటు ప్రత్యక్ష తరగతులకు దూరంగా ఉండటం, పర్యవేక్షణ లోపం, ఉపాధ్యాయుల కొరత వంటి పలు అంశాలు ఇందుకు కారణాలుగా నిలుస్తున్నాయి. ఎంఈవోలు లేక.. పర్యవేక్షణ కొరవడిజిల్లాలో పూర్తిస్థాయిలో ఎంఈవోలు లేకపోవడంతో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ ఉండటం లేదు. జిల్లాలోని పలు ప్రాథమిక పాఠశాలల్లో ఒకరిద్దరు ఉపాధ్యాయులే ఉండటంతో బోధనకు తీవ్ర ప్రతిబంధకాలు ఏర్పడుతున్నాయి. ఫలితంగా ఆయా తరగతుల్లోని విద్యార్థుల సామర్థ్యాలు పెరగడం లేదు. ప్రాథమిక తరగతుల్లో వెనుకబడిన విద్యార్థులు ఉన్నత తరగతులకు వెళ్లేసరికి చదవడంలో సామర్థ్యాలు కనబరుస్తున్నా గణిత చతుర్విధ ప్రక్రియల్లో వెనుకబడిపోతున్నారు.

ఉపాధ్యాయుల ప్రత్యేక చొరవ అవసరంపిల్లలకు ప్రాథమిక స్థాయి నుంచే చదువుల్లో గట్టి పునాది వేయాలి. జిల్లాలోని పాఠశాలల్లో నిర్వహిస్తున్న తొలిమెట్టు కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలి. విద్యార్థులు చదవడం, రాయడం, గణితంలో సామర్థ్యాలు పెంపొందించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

# దళితబంధులో దళారులు



ఖమ్మం : పిల్ల పుట్టక ముందే కుల్లా కుట్టినట్టు.. రెండో విడత అర్హుల ఎంపికకు మార్గదర్శకాలు విడుదల కాకముందే ఉభయ జిల్లాల్లో దళిత బంధు పథకంలో అక్రమాలు రాజ్యమేలుతున్నాయి. కొందరు రాజకీయ నేతలు, మధ్యవర్తులు అందినకాడికి దండుకుంటున్నారు. ఈ బాగోతమంతా కొద్దిమంది అధికార పార్టీ నేతల కనుసన్నల్లో సాగుతుండగా.. ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు ఉన్నచోటా వసూళ్ల పర్వం సాగుతోంది. ముందు ఒప్పందాలు, తర్వాతే జాబితాలో పేరు వస్తుందన్న నేతల తీరుతో విధిలేని పరిస్థితుల్లో ఆశావహులు అప్పులు చేసి రూ.లక్షలు ముట్టజెపుతున్నారు.దళితుల జీవితాల్లో వెలుగులు నింపే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన పథకమే దళిత బంధు. రాష్ట్రంలో ఖమ్మం జిల్లా చింతకాని మండలం పథకం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైంది. మండలంలో మొత్తం 3,462 కుటుంబాలకు రూ.346.20 కోట్లు కేటాయించారు. లబ్ధిదారుల ఎంపిక నుంచి యూనిట్ల జారీ వరకు అధికార యంత్రాంగం తీసుకున్న చర్యలతో అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు దక్కాయి. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి 100 చొప్పున యూనిట్లు మంజూరయ్యాయి. ఖమ్మం జిల్లాలో 483, భద్రాద్రి జిల్లాలో 421 మందికి వివిధ యూనిట్లు దక్కాయి.

నేతలే వసూల్ రాజాలు

తొలి విడత దళితబంధు లబ్ధిదారు కుటుంబాలు ఇప్పుడిప్పుడే ఆర్థికంగా గాడినపడుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో సుమారు 124 రకాల యూనిట్ల ద్వారా తాము నిలదొక్కుకోవడంతోపాటు నలుగురికి ఉపాధి అందిస్తున్నారు. ప్రభుత్వం ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి మరో 1100 చొప్పున యూనిట్లు మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకుంది. బడ్జెట్‌లో కేటాయింపులు చేసింది. ఈ లెక్కన ఉభయ జిల్లాల్లో 11 వేల మందికి దళితబంధు పథకం అందుతుంది. వీటిపై అర్హులు కొండంత ఆశలు పెట్టుకున్నారు. ఇదే రాజకీయ నేతల పాలిట వరంగా మారుతోంది. పథకాన్ని ఆశగా చూపి స్థానిక ప్రజాప్రతినిధులు దండుకుంటున్నారు. ఇప్పటివరకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియపై ఎలాంటి మార్గదర్శకాలు లేనప్పటికీ.. చాలా నియోజకవర్గాల్లో బేరసారాలు సాగిస్తున్నారు. గ్రామాలు, మండలాల వారీగా కొందరు నేతల కనుసన్నల్లోనే ఈ తంతు సాగుతోంది. నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులకు విషయం తెలిసినా కిమ్మనడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని నియోజకవర్గాల్లో వారి కుటుంబీకులే అన్నీతామై నడిపిస్తున్నారన్న విమర్శలున్నాయి. రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు ముందు చెల్లిస్తేనే జాబితాలో పేరు ఉంటుందని హెచ్చరిస్తుండటంతో అప్పోసప్పో చేసి దళితులు ముట్టచెబుతున్నారు.

ఆరోపణల జాబితా..

ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గంలో స్థానిక ప్రజాప్రతినిధులకు దళిత బంధు అర్హుల జాబితా చేసే బాధ్యత అప్పగించడంతో పథకానికి భారీ డిమాండ్ పలుకుతోంది. ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష-2 లక్షలు వసూలు చేస్తున్నారు. ఈ మొత్తంలో కొంత మొత్తం ముందే ముట్టజెప్పాలని, ఖాతాలో డబ్బు పడ్డాక మిగిలిన మొత్తం ఇచ్చేలా ఒప్పందాలు చేసుకుంటున్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో అన్నను కలిసి ప్రసన్నం చేసుకుంటేనే అర్హుల జాబితాలో చోటుదక్కుతుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. పేరుండాలంటే రూ.3 లక్షలు ముట్టజెప్పుకోవాల్సిందేనంటూ ఆయన హుకుం జారీ చేస్తున్నారు. ఇందుకోసం మధ్యవర్తుల్ని రంగంలోకి దింపుతున్నారు.ఇల్లెందు నియోజకవర్గంలో స్థానిక నేతలకు ఫలహారంగా మారింది. ఒక్కొక్కరి నుంచి రూ.2 లక్షలు తీసుకుంటున్నారు. కొంతమంది నుంచి ప్రాంసరీ నోట్లు రాయించుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

భద్రాచలం నియోజకవర్గంలోనూ రూ.లక్ష చొప్పున వసూలు చేస్తున్నట్లు సమాచారం.

అశ్వారావుపేట నియోజకవర్గంలో మండలాల వారీగా అధికార పార్టీ నాయకులే మధ్యవర్తుల అవతారమెత్తి రూ.2 లక్షలు గుంజుకుంటున్నారు. ప్రతిపక్ష నాయకులు ఉన్న నియోజకవర్గాల్లోనూ ఈ తంతు సాగుతుందన్న ఆరోపణలున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు వీటిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు

ఏలూరి శ్రీనివాసరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, ఖమ్మం జిల్లా

దళితబంధు రెండో విడత పథకంలో అర్హుల ఎంపికపై ఎలాంటి మార్గదర్శకాలపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు. ఆదేశాలు వచ్చిన వెంటనే ప్రక్రియ మొదలుపెడతాం. మేము ఎలాంటి దరఖాస్తులు తీసుకోవడం లేదు. ఆశావహులు మధ్య వర్తులను నమ్మి మోసపోవద్దు.

# డంప్ యార్డులు శుభ్రం!



కొత్తగూడెం : డంప్ యార్డుల్లో పేరుకపోయిన వ్యర్థాలను వేరు చేసేందుకు.. పరిసరాలను సుందరంగా మార్చేందుకు పురపాలక శాఖ నడుం బిగించింది. డంప్ యార్డుల రూపురేఖల్ని మార్చాలన్న యోచన, ఇందుకు సంబంధించిన ఉత్తర్వు గతేడాది ఏప్రిల్‌లో విడుదలైనా కసరత్తు పూర్తయ్యే వరకు దాదాపు ఏడాది పట్టింది. కొద్ది రోజుల క్రితం కొత్తగూడెం పురపాలక డంప్ యార్డులో చెత్త శుద్ధి పనులు ప్రారంభమయ్యాయి.

వర్షాకాలంలోపు పూర్తయితే..కొత్తగూడెం పురపాలకంలో వారం క్రితం శుద్ధి పనులు ప్రారంభమయ్యాయి. మిగిలిన చోట్లా కొద్ది రోజుల్లో ప్రారంభించే వీలుంది. వర్షాకాలంలోపు ఈ పనులు పూర్తయితే డంపింగ్ యార్డులో ఉద్యానం, డీఆర్‌సీసీ, కంపోస్ట్ యార్డు అందుబాటులోకి రానున్నాయి. డంప్‌యార్డు పరిసరాలు సర్వాంగ సుందరంగా మారుతాయి.ఇలా మొదలైంది..రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 132 పురపాలక సంఘాలను క్లస్టర్లుగా విభజించి వాటిల్లో డంప్‌యార్డుల శుద్ధి బాధ్యతలు పలు ఏజెన్సీలకు అప్పగించారు. భద్రాద్రికొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల పరిధిలోని 12 పురపాలక సంఘాలను ఎంఎస్ క్యూబ్ బయో ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు అప్పగించారు. క్షేత్ర స్థాయిలో పరిశీలన తర్వాత ఏజెన్సీ ప్రతినిధులు నివేదికను సీడీఎంఏకు అప్పగించారు. ఉన్నతాధికారుల అనుమతితో పనులు ప్రారంభించారు.

రోజులపాటు కసరత్తు

సంస్థ ప్రతినిధులు కొన్ని రోజులపాటు పట్టణాల్లో మకాం వేశారు. వారు పలు వివరాలు సేకరించారు.

పురాల్లో రోజుకు ఉత్పత్తి అవుతున్న వ్యర్థాలు, తడి, పొడి, హానికర వ్యర్థాలు వేరు చేసే విధానం ఎలా ఉంది?

పట్టణాలకు డంపింగ్ యార్డు దూరం ఎంత? ఎన్ని చెత్త తరలింపు వాహనాలున్నాయి?

యార్డు విస్తీర్ణం, పోగైన వ్యర్థాలు, ఎన్నేళ్ల నుంచి నిల్వలున్నాయి?

భూగర్భంలోకి ఎంతమేర వ్యర్థాలు చొచ్చుకుపోయాయి?

ఏఏ రకాల వ్యర్థాలు పోగయ్యాయి?

# ఎల్లంపల్లి ఎత్తిపోతలు

జగిత్యాల : ఎల్లంపల్లి ఎత్తిపోతల పథకం ద్వారా మెట్ట ప్రాంతాలకు గోదావరి జలాల ఎత్తిపోతలు గురువారం తిరిగి ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 28న నందిమేడారం పంపుహౌస్ నుంచి గంగాధర మండలం నారాయణపూర్ జలాశయానికి ఎత్తిపోతలు ప్రారంభించిన కొద్ది గంటల్లోనే పైపులైను గేట్‌వాల్వు పగిలి ఎత్తిపోతలు నిలిచిపోయిన సంగతి విదితమే. పగిలిన గేట్‌వాల్వు పంపుహౌస్ సమీపంలో ఉండగా వరద నీరంతా పంపుహౌస్‌లోకి చేరడంతో నష్టం వాటిల్లింది. ఈఎన్‌సీ నల్ల వెంకటేశ్వర్లు ఆదేశాలతో ఎస్‌ఈ సుధాకర్‌రెడ్డి, ఈఈ విష్ణుప్రసాద్, డీఈఈ బుచ్చిబాబు, ఏఈ రుత్విక్ నిరంతరం పర్యవేక్షించారు. పంపుహౌస్‌లో పని చేస్తున్న మెకానిక్‌లు ఇంజినీర్ల సలహాలు పాటిస్తూ పనులు చక్కబెట్టారు. వరద చొరబడిన రోజే పునరుద్ధరణ పనులు మొదలెట్టారు. పంపుహౌస్‌లో వరద నీటిని తోడేసి, పేరుకున్న పూడిక, బురదను తొలగించి శుభ్రం చేసేసరికి నాలుగు రోజులు పట్టింది. మోటార్లు తడిచిపోకున్నా అడుగు భాగాన ఉన్న పంపులకు అనుసంధానించే హెచ్‌వోపీడీ గేట్‌వాల్వుల సాంకేతిక వ్యవస్థ తడవడంతో మరమ్మతు ఆలస్యమైంది. పంపుల్లోని కండెనలను మార్చారు. ముందుగా ఒక పంపు మరమ్మతు బుధవారం రాత్రికి పూర్తయింది. ప్రమాదానికి కారణమైన బటర్‌ఫ్లై గేట్‌వాల్వు వద్ద పగిలిన పైపునూ మరమ్మతు చేశారు. ఒక మోటారు ద్వారా 247 క్యూసెక్కుల జలాలను తరలించనున్నారు. ఇప్పటికే చొప్పదండి నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో రైతులు పంటలు ఎండిపోతున్నాయని ఆవేదనగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఓవైపు మిగతా మోటార్ల మరమ్మతు పనులు కొనసాగిస్తూనే, పునరుద్ధరించిన మోటారు ద్వారా ఎత్తిపోతలు చేపట్టాలని నిర్ణయించారు.

వేమునూరు నుంచి తరలింపు షురూ

ఎల్లంపల్లి జలాశయం వద్దనున్న వేమునూరు పంపుహౌస్‌లో నాలుగు మోటార్లకు బుధవారం సాయంత్రం ఒక మోటారును ఆన్ చేశారు. రాత్రికి నందిమేడారం జలాశయానికి నీరు చేరింది. వేమునూరు నుంచి నందిమేడారం వరకు మధ్యలో ఉన్న గేట్‌వాల్వులు, స్కవర్ వాల్వుల వద్ద లీకయ్యే నీటితో ఎండిపోతున్న తమ పొలాలను పంటలను రక్షించుకుంటామని ఎండపల్లి, పాలకుర్తి మండల రైతుల విజ్ఞప్తులతో రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాలతో నీటిపారుదల శాఖ అధికారులు ఎత్తిపోతలు మొదలెట్టారు. అయితే వేమునూరు నుంచి నందిమేడారం జలాశయానికి ఎత్తిపోతలు చేపట్టకున్నా, కాళేశ్వరం పథకం ద్వారా ఎగువకు ఎత్తిపోతలు కొనసాగుతుండటంతో నందిమేడారం నుంచే ఎల్లంపల్లి పంపుహౌస్‌ల ద్వారా ఎగువకు తరలించుకునే వీలుంది. అయితే పైపులైను పొడవునా ఉన్న పంటల కోసం వేమునూరు నుంచి ఎత్తిపోస్తున్నారు.

# ఫలం విషపూరితం

ఖమ్మం : పండ్లు కాపునకు వచ్చాక సహజసిద్ధంగా పక్వానికి వస్తాయి. కొంతమంది వ్యాపారులు సీజన్ రాకముందే ఎక్కువ ధరకు విక్రయించాలనే స్వార్థంతో విష రసాయనాలు ఉపయోగించి మాగబెడుతున్నారు. దీంతో నాణ్యత లోపించడంతోపాటు వీటిని తిన్నవారు పలు రకాల వ్యాధులబారిన పడుతున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్న ఇటువంటి వ్యాపారుల ఆటలు కట్టించి సహజసిద్ధంగా, ఆరోగ్యానికి హాని కలిగించని రీతిలో మాగించే పద్ధతులపై అవగాహన కల్పించాలంటున్నారు కొనుగోలుదారులు.ఖమ్మం జిల్లాలో సుమారు 30 వేల ఎకరాల్లో రైతులు మామిడి తోటలు సాగు చేస్తున్నారు. 60 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తోంది. ఇక్కడి నుంచి న్యూఢిల్లీ, ముంబై, నాగపూర్, విజయవాడ, హైదరాబాద్ లాంటి ప్రముఖ నగరాలకు ఎగుమతి చేస్తారు. ఇక్కడ కొనుగోలు చేసేందుకు వివిధ రాష్ట్రాల నుంచి వ్యాపారులు వస్తుంటారని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ అధికారి అనసూయ తెలిపారు.

వ్యాపారులకు అవగాహన...

కృత్రిమంగా మాగబెట్టిన పండ్లను విక్రయించటం వల్ల కలిగే అనర్థాలపై ఇటీవల జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ పండ్ల వ్యాపారులతో అవగాహన సమావేశం నిర్వహించారు. మామిడి వ్యాపారులతో పాటు వ్యవసాయ, ఉద్యానశాఖ, ఫుడ్‌సేఫ్టీ, టాస్క్‌ఫోర్స్ అధికారులు పాల్గొన్నారు. వ్యాపారులకు సామాజిక బాధ్యత ఉండాలని హితవు పలికారు.

కాల్షియం కార్బైడ్‌తో ఆకట్టుకునే రంగు...



మామిడి, అరటి, సపోటా కాయలను కృత్రిమంగా మాగబెట్టటం చాలాకాలంగా ఉంది. రైతులు, వ్యాపారులు మామిడి కాయలను పక్వానికి రాకముందే కోసి కాల్షియం కార్బైడ్‌తో మాగబెడుతున్నారు. దూర ప్రాంతాలకు ఎగుమతి చేసేటప్పుడు వ్యాపారులు పక్వానికి రాని మామిడి కాయలతో పాటు కార్బైడ్‌ను ఉంచి రవాణా చేస్తే పచ్చి కాయలు కూడా మంచి రంగు సంతరించుకుంటాయి. దీంతో నాణ్యత సరిగా లేకపోవటమే కాకుండా తీయదనం కూడా తగ్గుతుంది. కాయ మాత్రం బంగారు వర్ణంలో చూపరులను ఆకట్టుకుంటుంది.

ఇథలీన్ వాయువు శ్రేష్టం

పండ్లను మాగబెట్టడానికి ఇథలీన్ వాయువును వాడటం ప్రమాదం లేని పద్ధతి. ఇందుకు మామిడి, అరటి, సపోటా కాయలు పక్వానికి(3 వంతులు తయారై) పచ్చి ఉండాలి. ఇథిలీన్ రైపనింగ్ ఛాంబర్స్ ఏర్పాటు, వాణిజ్యపరంగా ఇథిలీన్ వాయువు లభ్యత గురించి రైతులకు, వ్యాపారస్తులకు అవగాహన కల్పించాలి. వాణిజ్యపరంగా ఎక్కువ మోతాదులో కాయలను మాగబెట్టేందుకు అనువైన పద్ధతి. మామిడి కాయలను రైపనింగ్ ఛాంబర్‌లో ఉంచి 100-150 పీపీఎం ఇథిలీన్ వాయువును ప్రవేశపెట్టి, 12-24 గంటలు ఛాంబర్ తలుపులు తెరవకుండా ఉంచాలి. తర్వాత కాయలు 4-5 రోజుల్లో మంచి రంగు సంతరించుకుని పక్వానికి వస్తాయి.

చిరునోముల రైతు ఆదర్శం...

జిల్లాలోని బోనకల్లు మండలం చిరునోములలో ఎస్.మోహన్‌రావు అనే రైతు సపోటా పండ్లను సహజ పద్ధతుల్లో మాగించి విక్రయిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక గదిని ఏర్పాటు చేసి ఎలాంటి రసాయనాలు ఉపయోగించకుండా పూర్తిగా సహజ పద్ధతుల్లో మాగించటం విశేషం.

పలు రకాల వ్యాధులు...

కార్బైడ్ గాలిలోని తేమతో కలిసినప్పుడు వెలువడే ఎసిటలీన్ వాయువులో ఫాస్ఫిన్, ఆర్సిన్ ఉండటం వల్ల దీన్ని ఉపయోగించి మాగబెట్టిన పండ్లను తిన్న వారికి అల్సర్, క్యాన్సర్, కాలేయ, మూత్రపిండ వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది. ఎసిటలీన్ వాయువు కేంద్రనాడీ వ్యవస్థ మీద ప్రభావం చూపుతుంది. తల భారము, దీర్ఘకాలిక మత్తు(కోమా), జ్ఞాపకశక్తి కోల్పోయే ప్రమాదం ఉంది.

చట్ట ప్రకారం నిషేధం...

ప్రివెన్షన్ ఆఫ్ ఫుడ్ అడల్ట్రేషన్ 1954 చట్టం, ప్రివెన్షన్ ఆఫ్ ఫుడ్ అడల్ట్రేషన్ రూల్స్ 1955, రూల్ నెం.44(ఏఏ) ప్రకారం కాల్షియం కార్బైడ్‌తో పండ్లను మాగబెట్టటం కూడా నిషేధించారు. దీన్ని అతిక్రమించిన వారికి 3 సంవత్సరాల జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తారు.సహజ పద్ధతుల్లో మాగబెట్టే కేంద్రాలు..

అమృత రైపనింగ్ ఛాంబర్, కైకొండాయిగూడెం, ఖమ్మం అర్బన్ మండలం

గోల్డెన్ బనానా రైపనింగ్ ఛాంబర్, గోపాలపురం, వైరారోడ్డు, ఖమ్మం

## ఆరోగ్య మహిళ ఆరంభం

నిజామాబాద్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'ఆరోగ్య మహిళ' కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా అయిదుకేంద్రాలను ఎంపిక చేశారు. వీటిల్లో ప్రతి అతివలకు అవసరమైన వైద్యపరీక్షలు చేయనున్నారు.కార్యక్రమాన్ని ప్రారంభించి అతివలకు ప్రత్యేకంగా వైద్య పరీక్షలు చేశారు. నగరంలోని సీతారామ్‌నగర్ కాలనీ కేంద్రాన్ని మేయర్ నీతూకిరణ్ సందర్శించారు. ఆరోగ్య సమస్యలున్న వారిని వైద్యులు గుర్తించి ప్రభుత్వ జనరల్ దవాఖానాకు పంపించారు. ఇలాంటివారి కోసం జిల్లాకేంద్రంలోని ఆసుపత్రిలో ప్రత్యేకంగా 'ఆరోగ్య మహిళా సెల్' ఏర్పాటు చేశారు.

సద్వినియోగం చేసుకోవాలి జిల్లావ్యాప్తంగా అయిదు ఆరోగ్య కేంద్రాలు గుర్తించాం. మహిళలు వైద్య పరీక్షలు చేసుకోవాలి. ప్రభుత్వం కల్పించిన సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి.సుదర్శనం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

# స్కాంలో ఉన్నది ఎంతటివారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదు: మంత్రి బొత్స




విజయవాడ: టీడీపీ అధినేత చంద్రబాబుపై సెటైరికల్ పంచ్ వేశారు మంత్రి బొత్స సత్యనారాయణ. దొరికితే దింగ.. దొరక్కపోతే దొర అన్నట్టుగా చంద్రబాబు ఇన్నాళ్లు ప్రవర్తించారు. ఇన్నాళ్లు తప్పులు చేసినా దొరకలేదు.. ఇప్పటికి దొంగ దొరికిపోయి జైలుకు వెళ్లారని చురకలంటించారు. అలాగే, స్కిల్ స్కాంలో అధికారుల పాత్ర ఉంటే వారిపై కూడా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కాగా, తాజాగా మంత్రి బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ.. స్కిల్ స్కాం కేసులో ప్రేమ చంద్రారెడ్డి మీద మాకు ప్రత్యేక ప్రేమ ఏమీ లేదు. స్కాంలో ఎవరి పాత్ర ఉంటే వారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం. అధికారులు అభ్యంతరం చెప్పిన తర్వాతే ఫైల్ సీఎం దగ్గరకు వెళ్తుంది. దానికి ముఖ్యమంత్రిదే బాధ్యత ఉంటుంది. రిమాండ్ కొనసాగింపు సందర్భంగా తానేం తప్పు చేయలేదని చంద్రబాబు అంటున్నారు. అందుకే ప్రజాజీవితంలో ఉన్న వాళ్లు జాగ్రత్తగా ఉండాలి. అవినీతి చేయకుండా పరిపాలన సాగించాలి.

**సాఫ్ట్‌వేర్‌కు అన్ని వేల కోట్లా..? :** ఇన్నాళ్లూ తప్పులు చేసినా దొరకలేదు. దొరికితే దొంగ.. దొరకకపోతే దొర అన్నట్టు చంద్రబాబు ఇన్నాళ్లూ వ్యవహరించారు. రాష్ట్ర ప్రభుత్వ వాటా ఇచ్చాక.. సీమెన్స్ కంపెనీ తన వాటా ఎందుకివ్వలేదు. మధ్యలో డిజైన్ టెక్ ఎలా వచ్చింది?. చంద్రబాబు తెలిసే తప్పు చేశారు. సీమెన్స్ కంపెనీ మంచి కంపెనీనే. కానీ, ఒప్పందం ప్రకారం జరగలేదు. సాఫ్ట్ వేర్ రూ.2900 కోట్లా?. సీమెన్స్ కంపెనీ నుంచి రావాల్సిన సాఫ్ట్ వేర్.. ఎక్విప్మెంట్ ఎందుకు రాలేదు?. రాష్ట్ర ప్రభుత్వ ధనాన్ని అన్యాక్రాంతం చేశారు. చంద్రబాబు చేసిన అవినీతిపై ఆధారాలు ఉన్నాయి. మా ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తోంది. మా ప్రభుత్వం అవినీతిని సహించదు.

ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తామంటే కుదరదు. అవినీతి చేసిన వారు ఎంతటివారైనా చర్యలు తప్పవు. ఈరోజు పెద్ద పెద్ద అక్షరాలతో వార్తలు రాసిన పేపర్లు.. చంద్రబాబు ఎందుకు అవినీతికి పాల్పడ్డారో ఆయనను అడగాలి అని కామెంట్స్ చేశారు.

# తొలి రోజు ముగిసిన చంద్రబాబు సీఐడీ విచారణ



రాజమహేంద్రవరం: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో తెదేపా అధినేత చంద్రబాబు తొలి రోజు సీఐడీ విచారణ ముగిసింది. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు కాన్ఫరెన్స్ హాలులోనే అధికారులు విచారణ చేపట్టారు. సీఐడీ డీఎస్పీ ధనుంజయుడు నేతృత్వంలోని 12 మంది సభ్యుల బృందం ఆయన్ను ఉదయం 9.45 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విచారించింది. ఉదయం, సాయంత్రం రెండు విడతల్లో సుమారు 6గంటల పాటు సీఐడీ అధికారులు చంద్రబాబును ప్రశ్నించారు. చంద్రబాబు తరఫు న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ సమక్షంలో ఈ విచారణ కొనసాగింది. విచారణకు ముందు, తర్వాత చంద్రబాబుకు వైద్య పరీక్షలు నిర్వహించారు. చంద్రబాబును రెండు రోజుల పాటు సీఐడీ కస్టడీకి ఇస్తూ విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానం శుక్రవారం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం జ్యుడిషియల్ రిమాండులో ఉన్న చంద్రబాబును రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం ప్రాంగణంలోనే విచారించాలని కోర్టు సూచించింది. శని, ఆదివారాలు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల మధ్యే విచారించాలని, గంటకోసారి అయిదు నిమిషాల విరామమిచ్చి న్యాయవాదిని సంప్రదించుకునేందుకు అవకాశమివ్వాలని పేర్కొంది. ఈ మేరకు ఏసీబీ న్యాయస్థానం న్యాయాధికారి హిమబిందు ఆదేశాలిచ్చారు. చంద్రబాబుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించరాదని, ఎలాంటి తీవ్రమైన చర్యలు తీసుకోవద్దని స్పష్టం చేశారు. కస్టడీకి తీసుకునే ముందు, కస్టడీ ముగిసిన తర్వాత ఆయనకు తప్పనిసరిగా వైద్యపరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. విచారణను సీఐడీకి చెందిన వీడియోగ్రాఫర్‌తో మాత్రమే రికార్డు చేయించాలని, ఆ వీడియో మొత్తాన్ని సీల్డ్‌కవర్‌లో న్యాయస్థానానికి సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్న విషయం తెలిసిందే.




# తెదేపా- జనసేన పొత్తుపై పురంధేశ్వరి స్పందన..!

రాష్ట్రంలో పొత్తులపై అధిష్ఠానమే నిర్ణయం తీసుకుంటుందని భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి మరోసారి స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీతో పొత్తుపై పవన్ కల్యాణ్ తమ అధిష్ఠానానికి వివరిస్తారని, ఆ తర్వాతే నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. పొత్తులపై కేంద్ర నాయకత్వం తమ అభిప్రాయాలు కూడా తీసుకుంటుందని స్పష్టం చేశారు. అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా అందుకు రాష్ట్ర నాయకత్వం కట్టుబడి ఉంటుందన్నారు. విశాఖలో పురంధేశ్వరి మీడియాతో మాట్లాడుతూ.. ప్రజావేదిక కూల్చివేత నుంచే రాష్ట్రంలో అరాచక పాలన మొదలైందన్నారు. ప్రభుత్వానికి ఎవరైనా వ్యతిరేకంగా మాట్లాడితే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆరోపించారు. నిర్మాణాత్మకంగా వ్యవహరించాల్సిన ప్రభుత్వం.. కక్షపూరిత ధోరణితో వ్యవహరించడం బాధాకరమన్నారు.




# ఇది కొవ్వూరు ఎస్సీ హాస్టల్ విద్యార్థుల దుస్థితి

చిన్న గదిలో కిక్కిరిసిపోయి పడుకున్న ఈ పిల్లలు ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు ఎస్సీ హాస్టల్ పెచ్చులూడి ప్రమాదకరంగా మారడంతో పక్కనున్న బడిలో ఇలా నిద్రించారు. వసతిగృహ భవనం పెచ్చులూడి వర్షపు నీరు లోనికి వస్తోంది. పైగా కనీస సౌకర్యాలూ లేవు. విధిలేక విద్యార్థులు మూడు రోజులుగా సమీపంలోని ప్రాథమిక పాఠశాలలో పడుకుంటున్నారు. గురువారం రాత్రి ఓ చిన్న గదిలో 70 మంది సర్దుకుపోయారు. విద్యా వ్యవస్థను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దుతున్నామని ఊదరగొడుతున్న సీఎం జగన్ మాటలకు.. క్షేత్రస్థాయిలో పరిస్థితులకు ఏమాత్రం పొంతన లేదనడానికి ఈ విద్యార్థుల దుస్థితే నిదర్శనం.

# జైలు మోహన్‌కు బెయిల్‌డే వార్షికోత్సవ శుభాకాంక్షలు: లోకేశ్




అమరావతి: జైలులో ఉండాల్సిన సీఎం జగన్ పదేళ్లుగా బెయిల్‌పై ఉన్నారని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. జనంలో ఉండాల్సిన నిజాయతీపరుడు, తెదేపా అధినేత చంద్రబాబు ప్రస్తుతం జైలులో ఉన్నారని పేర్కొన్నారు.

ఈ మేరకు నారా లోకేశ్ ట్వీట్ చేశారు. "జైలు మోహన్‌కు బెయిల్‌డే పదో వార్షికోత్సవ శుభాకాంక్షలు. జైలు మోహన్.. ప్రజాస్వామ్య వ్యవస్థలను ధ్వంసం చేస్తున్నారు. రూ.42 వేల కోట్ల ప్రజాధనం దోచేశారు. జగన్‌పై సీబీఐ, ఈడీ సహా 38 కేసులు ఉన్నాయి. జైలులో ఉండాల్సిన ఆయన.. పదేళ్లుగా బెయిల్‌పై ఉన్నారు" అని లోకేశ్ ధ్వజమెత్తారు.




## కెనడా-ఇండియా ఉద్రిక్తతలు.. అమెరికా మొగ్గు ఎటువైపో చెప్పిన పెంటాగన్ మాజీ అధికారి

వాషింగ్టన్: 'ఖలిస్థానీ' అంశంలో భారత్‌పై కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేస్తోన్న వ్యాఖ్యలతో రెండు దేశాల మధ్య సంబంధాలు దిగజారుతున్నాయి. ఈ సమయంలో రెండు మిత్ర దేశాల విషయంలో అమెరికా మొగ్గు ఎటువైపు ఉంటుందనే ప్రశ్నలు తలెత్తున్నాయి. వీటికి పెంటాగన్ మాజీ అధికారి మైఖెల్ రూబిన్ ఏం చెప్పారంటే..? 'రెండు మిత్రదేశాల విషయంలో అమెరికా ఒకరికి మద్దతుగా నిలుస్తుందని నేను అనుకోవడం లేదు. ఒకవేళ అలా ఎంచుకోవాల్సి వస్తే.. ప్రస్తుత వ్యవహారంలో అమెరికా మొగ్గు భారత్ వైపే ఉంటుంది. ఎందుకంటే నిజ్జర్ ఒక ఉగ్రవాది. అమెరికాకు భారత్ చాలా ముఖ్యమైంది. మా బంధం చాలా ముఖ్యమైంది. కెనడా ప్రధాని హోదాలో జస్టిన్ ట్రూడో ఎక్కువ కాలం కొనసాగకపోవచ్చు. ఆయన వెళ్లిపోయిన తర్వాత కెనడాతో మా బంధాన్ని పునర్నిర్మించుకుంటాం' అంటూ అమెరికా వ్యవహారశైలి గురించి మాట్లాడారు.

అలాగే ఈ విషయంలో అమెరికా బహిరంగంగా జోక్యం చేసుకుంటుందా..? అని మీడియా అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. 'నిజం చెప్పాలంటే.. ఈ ఘర్షణ భారత్ కంటే కెనడాకే ఎక్కువ ప్రమాదం. ఘర్షణే కావాలనుకుంటే.. అది ఏనుగుతో చీమ పోరాటం లాగే ఉంటుంది. భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమనేది వాస్తవం. చైనాను ఎదుర్కొనే విషయంలో వ్యూహాత్మకంగా భారత్‌తో మా బంధం చాలా ముఖ్యమైంది' అని స్పష్టం చేశారు.




తెదేపా అధినేత చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ విదేశాల్లో ప్రవాసాంధ్రుల ఆందోళన కొనసాగుతోంది. బహ్రెయిన్‌లోని మనామా నగరంలో ఎన్నారై తెదేపా సభ్యులు నిరసన తెలిపారు. ఫర్వానియాలో ఎన్నారై తెదేపా కువైట్, జనసేన కువైట్ సంయుక్త ఆధ్వర్యంలో 'వీ స్టాండ్ విత్ సీబీఎన్' కార్యక్రమం నిర్వహించారు. సైకో పోవాలి.. సైకిల్ రావాలి అని నినాదాలు చేశారు.

# బెయిల్‌పై 10ఏళ్లు.. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో జగన్ పేరు.. పట్టాభి సెటైరికల్ పంచ్



అమరావతి: సీఎం జగన్ రెడ్డి జీవితంలో ఈరోజు అత్యంత సంతోషకరమైన రోజు అని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ వ్యాఖ్యలు చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. కోర్టు బెయిల్‌పై దర్జాగా జీవిస్తూ, తన బెయిల్ కాలాన్ని 10 ఏళ్లు పూర్తి చేసుకున్న ముఖ్యమంత్రి పట్టరాని ఆనందంతో పదవ బెయిల్ వార్షికోత్సవం జరుపుకుంటున్నారని ఎద్దేవా చేశారు. సరిగ్గా పదేళ్లక్రితం ఇదేరోజున (సెప్టెంబర్ 23, 2013న) జగన్ రెడ్డి తనపై ఉన్న 11 సీబీఐ కేసుల్లో బెయిల్ పొంది జైలు నుంచి జనాల్లోకి వచ్చారన్నారు. జగన్ రెడ్డి సాధించిన ఈ గొప్ప ఘనతను గుర్తించి, 'ఎక్కువ కాలం బెయిల్‌పై జీవించిన వ్యక్తి' గా జగన్ రెడ్డిని గుర్తించి, ఆయనకు ఒక రికార్డ్ ఇవ్వాలని కోరుతూ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ వారికి మెయిల్ పెట్టినట్లు సెటైర్ విసిరారు. వారు త్వరలోనే జగన్ రెడ్డిని కలిసి ఆయన సాధించిన ఘనతకు సంబంధించిన సర్టిఫికెట్ అందిస్తారన్నారు. ఆ సర్టిఫికెట్‌ను జగన్ రెడ్డి పెద్దపెద్ద ఫ్రేములు కట్టించి తన ప్యాలెస్‌లతో పాటు,ప్రభుత్వ కార్యాలయాల్లో పెట్టాలని వ్యాఖ్యలు చేశారు. ఈ శుభసందర్భాన్ని పురస్కరించుకొని వైసీపీ శ్రేణులు ఆనందోత్సాహాలతో తాడేపల్లి ప్యాలెస్‌లో సంబరాలు చేసుకుంటున్నారన్నారు. మరోపక్క ముఖ్యమంత్రి సతీమణి భారతిరెడ్డి పట్టరాని సంతోషంతో తమ పార్టీ నేతలకు పాయసం పంచి పెడుతోందని ఆయన అన్నారు. అలానే టీడీపీ శాసనసభాపక్షం ముఖ్యమంత్రి ప్రతిభను, గొప్పతనాన్ని తెలియచేస్తూ పదేళ్ల బెయిల్ కాలంపై అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టాలనుకుంటోందంటూ సెటైరికల్ కామెంట్స్ చేశారు. టీడీపీ ఇచ్చే తీర్మానంపై వైసీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు కూడా చర్చలో పాల్గొని వారి అభిమాన నాయకుడు జగన్ రెడ్డిని మనస్ఫూర్తిగా అభినందించాలన్నారు. ఇంత గొప్ప ఆలోచన చేసిన టీడీపీ సభ్యులు యూజ్ లెస్ ఫెలోస్ కాదు.. యూజ్ ఫుల్ పర్సన్స్ అని స్పీకర్ ఇప్పటికైనా తమ పార్టీ ముందు చూపుని అభినందిస్తే బాగుంటుందని చెప్పుకొచ్చారు. అలానే జగన్ రెడ్డి తన పదేళ్ల బెయిల్ కాలంలోని అనుభవాలను వివరిస్తూ కోర్టులను తప్పించుకొని ఎక్కువకాలం బెయిల్ ఉండటం ఎలాగో వివరిస్తూ ఒక పుస్తకం రాస్తే అది నేరసామ్రాజ్యానికి దిక్సూచిగా ఉంటుందన్నారు. జగన్ రెడ్డి ఇలాంటి ఘనతలు సాధిస్తే ప్రజానాయకుడు అయిన చంద్రబాబు ఏమో ఇండియన్ ఆఫ్ ది మిలీనియం, సౌత్ ఏషియన్ ఆఫ్ ది ఇయర్ వంటి పురస్కారాలతో సరిపెట్టుకున్నారన్నారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరం డ్రీమ్ కేబినెట్లో చంద్రబాబుకు చోటు దక్కితే, వరల్డ్ ప్రిజనరీస్ ఫోరం గౌరవాధ్యక్షుడిగా జగన్ రెడ్డి గుర్తింపు పొందారన్నారు.

ఎలాంటి స్థితిలో తానుండి ఏ మచ్చా లేని చంద్రబాబు నాయుడిని అన్యాయంగా జైలుకు పంపాడో ఈరోజైనా జగన్ రెడ్డి ఆత్మవిమర్శ చేసుకుంటే మంచిది అంటూ పట్టాభి హితవుపలికారు.




చెన్నై: తమిళనాడులోని స్టాలిన్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అవయవ దాతలకు ప్రభుత్వం లాంఛనాలతోనే అంత్యక్రియలు నిర్వహిస్తామని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శనివారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'అవయవ దానం విషయంలో తమిళనాడు దేశంలోనే అగ్రగామిగా ఉంది. విషాదకర పరిస్థితుల్లో తమ ఆత్మీయుల అవయవాలను దానం చేసేందుకు ముందుకు వచ్చిన కుటుంబాల నిస్వార్థమైన త్యాగాల వల్లే ఈ ఘనత సాధ్యమైంది. మరణానంతర అవయవదానం చేయటం వల్ల ఎంతో మంది ప్రాణాలు నిలబడ్డాయనే విషయాన్ని ప్రతి ఒక్కరూ తమ బంధుమిత్రులకు తెలియజేయాలి. మిగిలిన వాళ్లు కూడా అవయవ దానం చేసేలా ప్రోత్సహించాలి. అవయవ దాతలు, వారి కుటుంబ సభ్యుల త్యాగాన్ని గుర్తించి ఆర్గాన్ డోనర్స్ అంత్యక్రియలకు రాష్ట్రం తరఫున గౌరవం ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ఈ నిర్ణయం తీసుకున్నాం' అని సీఎం స్టాలిన్ తెలిపారు.

# హీరోయిన్ రేంజ్ అందాలతో సారా టెండూల్కర్

క్రికెట్ అనగానే మనకు గుర్తుకు వచ్చే పేర్లలో సచిన్ టెండూల్కర్ పేరు ముందు ఉంటుంది. క్రికెట్ దేవుడు అంటూ సచిన్ టెండూల్కర్ కి పేరు. అంతటి సచిన్ వారసులు రెగ్యులర్ గా సోషల్ మీడియా ద్వారా సందడి చేస్తున్నారు. సచిన్ తనయుడు క్రికెట్ తో అలరిస్తూ ఉంటే కూతురు సారా టెండూల్కర్ హీరోయిన్ రేంజ్ అందాలతో అలరిస్తూ ఉంటుంది. రెగ్యులర్ గా సారా టెండూల్కర్ సోషల్ మీడియాలో ఫోటో షూట్స్ ను షేర్ చేస్తూ ఉంటుంది. హీరోయిన్స్ కి ఏమాత్రం తీసి పోకుండా సారా టెండూల్కర్ అందం ఉంటుంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తూ ఉంటారు. గతంలో పలు సార్లు ఆమె షేర్ చేసిన ఫోటోలు మరియు వీడియోలు చూసిన వారు హీరోయిన్ గా ఎంట్రీ ఇవ్వాలని కోరుకున్నారు.



తాజాగా మరోసారి సారా టెండూలర్క్ తన అందమైన ఫోటో షూట్ ను షేర్ చేసింది. ఇండస్ట్రీలో ఉన్న చాలా మంది హీరోయిన్స్ తో పోల్చితే సారా టెండూల్కర్ మరింత అందంగా ఉంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. తన కూతురును సచిన్ ఎందుకు హీరోయిన్ గా పరిచయం చేయడం లేదని కూడా కొందరు ప్రశ్నిస్తున్నారు. ఎల్లో డ్రెస్ లో సారా టెండూల్కర్ చిరు నవ్వులు చిందిస్తూ సూపర్ స్కిన్ టోన్ తో ఆకట్టుకుంది. ఇప్పట్లో కాకున్నా ముందు ముందు అయినా సారా టెండూల్కర్ ఖచ్చితంగా హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి అనిపిస్తుంది. సారా హీరోయిన్ గా చేయకుంటే ఆమె అందం అంతా వృధా అన్నట్టు కొందరు ఫ్యాన్స్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# స్కంద బిజినెస్ లో దిల్ రాజు గేమ్

రామ్ పోతినేని హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా స్కంద. హై వోల్టేజ్ యాక్షన్ ఎంటర్టైనర్ గా ఈ చిత్రాన్ని బోయపాటి శ్రీను ఆవిష్కరించారు. రామ్ కెరియర్ లోనే హైయెస్ట్ బడ్జెట్ తో ఈ చిత్రాన్ని శ్రీనివాస్ చిట్టూరి నిర్మించారు. హీరో రామ్ కూడా ఇది వరకు ఎన్నడూ కనిపించని విధంగా పవర్ ఫుల్ మాస్ లుక్ లో ఈ చిత్రంలో కనిపించబోతున్నాడు. బోయపాటి సినిమా స్టైల్ ఎలా ఉంటుందో అందరికి తెలిసిందే. అయిన కానీ అతని సినిమాలు ప్రేక్షకులు చూడటానికి వెళ్తారంటే పవర్ ఫుల్ ఎలివేషన్స్, అదిరిపోయే గూస్ బాంబ్స్ యాక్షన్ సీక్వెన్స్ కోసమే. బోయపాటి చిత్రంలో ఉన్నట్లుగా యాక్షన్ సీక్వెన్స్ ఇతర సినిమాలలో కనిపించవు. పవర్ ప్యాక్డ్ సన్నివేశాలు పుష్కలంగా ఉంటాయి. అందుకే మాస్ ఆడియన్స్ ఎక్కువగా బోయపాటి సినిమాలు ఇష్టపడతారు.



స్కంద మూవీ రిలీజ్ నిజానికి సెప్టెంబర్ 15 అనుకున్నారు. అయితే దిల్ రాజు రిక్వెస్ట్ మేరకు మూవీ సెప్టెంబర్ 28కి వాయిదా వేశారు. అయితే కారణాలు ఏంటనేది తెలియదు కానీ ఇప్పటి వరకు మూవీ అసలు ప్రమోషన్ మొదలు పెట్టలేదు. ఇక స్కంద రిలీజ్ కి వారం రోజుల సమయం మాత్రమే ఉంది. పాన్ ఇండియా లెవల్ లో ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నారు. ప్రమోషన్స్ చాలా గట్టిగా చేయాల్సి ఉంటుంది. కానీ ఇప్పటి వరకు ఈ సినిమాకి సంబంధించి గట్టిగా వినిపించే సౌండ్ అయితే రాలేదు. కల్ట్ మామా సాంగ్ రిలీజ్ అయిన ప్రేక్షకులకి అంతగా కనెక్ట్ కాలేదు. సెప్టెంబర్ 28 రిలీజ్ విషయంలో రామ్ పోతినేని, బోయపాటి శ్రీను ఇద్దరూ సంతృప్తికరంగా లేరంట. అయితే ఆ రోజు అయితే బిజినెస్ పరంగా బాగా వర్క్ అవుట్ అవుతుందని ఒప్పించి దిల్ రాజు వాయిదా వేయించారు. ఈ కారణంగా దిల్ రాజుపై హీరో, డైరెక్టర్ ఇద్దరూ అసంతృప్తి ఉన్నారని టాక్ వినిపిస్తోంది. సెప్టెంబర్ 28న స్కందకి పోటీగా మరికొన్ని సినిమాలు రిలీజ్ అవుతున్నాయి. వాటి నుంచి ఎంతో కొంత పోటీ అయితే కచ్చితంగా ఉంటుందని నమ్ముతున్నారు. అందుకే అది బెస్ట్ టైం కాదని రామ్, బోయపాటి ఫీలింగ్. ఏది ఏమైనా రిలీజ్ డేట్ అయితే కన్ఫర్మ్ అయ్యింది కాబట్టి ఇకనుంచైనా ప్రమోషన్ కాస్తా స్పీడ్ చేస్తారేమో వేచి చూడాలి.





# చికటినే భయపెట్టే టైగర్.. మాస్ రాజా సాలీడ్ సౌండ్!




మాస్ మహారాజ్ రవితేజ కెరీర్ లోనే అత్యంత భారీ బడ్జెట్ తో రూపొందిన సినిమా టైగర్ నాగేశ్వరరావు. అలాగే ఈ సినిమా రవితేజ సినిమా కెరియర్ లోనే అత్యధిక స్థాయిలో విడుదల కాబోతోంది. పాన్ ఇండియా రేంజ్ లో ఈ సినిమాను విడుదల చేయాలని అనుకుంటున్నారు. ఇక ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్ కూడా చాలా హడావిడిగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఒక పాటను కూడా విడుదల చేయగా డీసెంట్ రెస్పాన్స్ అయితే అందుకుంది. ఇక ఇప్పుడు హీరో క్యారెక్టర్ కు సంబంధించిన మరొక సాంగ్ ను విడుదల చేశారు. అందులో టైగర్ నాగేశ్వరరావు పాత్ర విధానాన్ని ధైర్యాన్ని తెగింపుని హైలెట్ చేసే విధంగా చంద్రబోస్ అద్భుతమైన లిరిక్స్ అయితే అందించారు. ఇక అనురాగ్ కులకర్ణి పాడిన ఈ పాటకు జీవి ప్రకాష్ కుమార్ బాణీలు అందించారు. రవితేజ స్టువర్ట్ పురం గజదొంగ టైగర్ నాగేశ్వరరావు పాత్రలో కనిపించబోతున్న విషయం తెలిసిందే. అందరూ ఆగిపోయిన చోటే వీడు మొదలవుతాడు. చీకటిని భయపెట్టేదే వీడు.. అంటూ సాగే ఈ పాట హీరో క్యారెక్టర్ ను పవర్ ఫుల్ గా ఎలివేట్ చేస్తోంది. ఇక విజువల్స్ కూడా చాలా ఘాటుగా ఉన్నాయి అనిపిస్తోంది. సినిమాను దర్శకుడు వంశీ డిఫరెంట్ డ్రా ఫిలిం గా తెరపైకి తీసుకురాబోతున్నాడు. ఇప్పటికే విడుదలైన టీజర్ కూడా పాజిటివ్ వైబ్రేషన్స్ క్రియేట్ చేసింది. మార్కెట్లో కూడా ఈ సినిమాకు మంచి డిమాండ్ అయితే ఏర్పడింది. ఇప్పటికే నిర్మాత చాలా ఏరియాలకు సంబంధించిన బిజినెస్ డీల్స్ కూడా క్లోజ్ చేసుకున్నాడు. ఇక ఈ సినిమాను దసరా సందర్భంగా అక్టోబర్ 20వ తేదీన గ్రాండ్గా ఫ్యాన్ ఇండియా రేంజ్ కు తగ్గట్టుగా విడుదల చేయబోతున్నారు. ఈ సినిమాలో రవితేజకు జోడిగా నుపూర్ సనమ్ నటిస్తోంది. ఇక రేణు దేశాయ్ ఒక ప్రత్యేకమైన పాత్రలో కనిపించబోతున్నారు. త్వరలోనే సినిమాకు సంబంధించిన ట్రైలర్ను కూడా విడుదల చేయబోతున్నారు. ఈ సినిమాతో రవితేజ కెరియర్ బిగ్గెస్ట్ హిట్ అందుకోవాలి అని చూస్తున్నాడు. మరి సినిమా ఆ అంచనాలను అందుకుంటుందో లేదో చూడాలి.

# లియో సందేశం: కామ్‌గా వార్‌కి సిద్ధం కండి




సౌతిండియా మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా చిత్రంగా 'లియో' గురించి ఆసక్తికర చర్చ సాగుతోంది. దళపతి విజయ్ నటించిన ఈ సినిమాకి విక్రమ్ ఫేం లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహించడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఇండియన్ సినిమా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసే సత్తా లియోకి ఉంది అంటూ ఒక వర్గం విశ్లేషిస్తోంది. అందుకు తగ్గట్టే ఇంతకుముందు విడుదల చేసిన లియో పోస్టర్లు, టీజర్ ప్రతిదీ ఎంతో ఆకట్టుకున్నాయి.

తాజాగా మరో కొత్త పోస్టర్ ని లియో బృందం విడుదల చేయగా అది వైరల్ గా మారింది. కొత్త పోస్టర్‌లో విజయ్‌ని అద్భుతమైన అవతార్‌లో ప్రదర్శించారు. దీనికి క్యాప్షన్ ఆసక్తికరం. "నిశ్శబ్ధంగా ఉండండి.. యుద్ధానికి సిద్ధం కండి" అని క్యాప్షన్ ఇచ్చారు. పోస్టర్లపై ప్రదర్శించిన క్యాప్షన్‌ల ఆధారంగా ఈ సినిమా భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ అని అర్థమవుతోంది. అలాగే అభిమానులు ఎవరికి వారు లియో కథ గురించి రకరకాల సిద్ధాంతాలను ఊహిస్తున్నారు. ఈ సినిమా ఆడియో లాంచ్‌ను చెన్నైలో త్వరలో నిర్వహించనున్నట్టు ప్రచారం జరుగుతోంది కానీ.. ఇంతవరకూ ఏదీ ప్రకటించలేదు. ఇది పాన్-ఇండియన్ చిత్రం కాబట్టి మేకర్స్ సినిమాను దేశవ్యాప్తంగా ప్రమోట్ చేయాలని అభిమానులు కోరుకుంటున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేయనుంది.

సెవెన్ స్క్రీన్ స్టూడియో పతాకంపై ఎస్.ఎస్.లలిత్ కుమార్ లియోను నిర్మించారు. ఈ చిత్రంలో త్రిష కృష్ణన్, సంజయ్ దత్, అర్జున్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రాన్ని స్టాండర్డ్ అలాగే ఐమాక్స్ ఫార్మాట్‌లలో అక్టోబర్ 19న గ్రాండ్ రిలీజ్ చేయనున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీత స్వరకర్త. పాటలకు చక్కని స్పందన దక్కింది. సైలెంట్ గా యుద్ధానికి సిద్ధమవుతున్న లియో చిత్రం జవాన్ తర్వాత పాన్ ఇండియా విజయాన్ని తన ఖాతాలో వేసుకుంటుందా? కలెక్షన్ల సునామీ సృష్టిస్తుందా? అన్నది ఇప్పటికి సస్పెన్స్. ఉత్తరాది ఆడియెన్ కి కనెక్ట్ చేయడంలో కనగరాజ్ - విజయ్ బృందం సఫలమైతే ఆశించినది సాధించినట్టే. కానీ అది జరుగుతుందా? అన్నది ఇప్పటికి సస్పెన్స్.

# జవాన్ విషయంలో నయన్ అప్సెట్.. వాస్తవం ఏంటంటే..!

షారుఖ్ అట్లీ కాంబినేషన్ లో వచ్చిన జవాన్ సినిమాలో నయనతార హీరోయిన్ గా నటించిన విషయం తెలిసిందే. బాలీవుడ్ ఎంట్రీ తోనే బాక్స్ లు బద్దలు కొట్టే హిట్ అందుకుంది నయన్. ఆమె ఖాతాలో హిట్ పడినా సరే సినిమా విషయంలో నయనతార అప్సెట్ గా ఉందని కోలీవుడ్ టాక్. అలా ఎందుకు అంటే నయనతార జవాన్ సినిమాలో నర్మదా రాయ్ పాత్రలో నటించింది. సినిమాలో నయనతార తో పాటుగా దీపికా పదుకొనే కూడా నటించింది. దీపికాది కెమియో రోల్ నయనతార అసలు హీరోయిన్ కాగా సినిమా చూసిన ఆడియన్స్ నయనతార గెస్ట్ రోల్ చేస్తే దీపికాదే మెయిన్ లీడ్ గా ఉందని అంటున్నారు. జవాన్ డైరెక్టర్ నయనతార పాత్రను కట్ చేయడంతో నయన్ రోల్ సినిమాలో చాలా చిన్నది అయ్యింది. అయితే ఈ విషయంపై ఆమెకు ఎలాంటి ఇన్ఫర్మేషన్ లేకపోవడంతో నయనతార చాలా ఫీల్ అయ్యిందట. అందుకే జవాన్ ప్రమోషన్స్ లో ఎక్కడ నయన్ కనిపించలేదు. ఆఖరికి తమిళ ప్రమోషన్స్ లో కూడా నయనతార పాల్గొనలేదు. అయితే ఒక పక్క నయన్ అట్లీల మధ్య ఇలాంటి



వార్తలు వస్తుండగా మరోపక్క నయనతార జవాన్ విషయంలో అప్సెట్ అయిన వార్తల్లో ఎలాంటి నిజం లేదని షారుఖ్ తో స్క్రీన్ సేర్ చేసుకున్నందుకు ఆమె హ్యాపీగా ఉన్నారని అంటున్నారు. అంతేకాదు ఇటీవలే ఆమె ఇన్ స్టాగ్రామ్ లో ఎంట్రీ ఇచ్చారు. చేతినిండా సినిమాలు సంతోషకరమైన ఫ్యామిలీ కెరీర్ లో ఇంకా చాలెంజింగ్ రోల్స్ చేయాలని ఉత్సాహంగా ఉంది నయనతార. జవాన్ తర్వాత బాలీవుడ్ నుంచి వరుస అవకాశాలు వస్తున్నా నయన్ మాత్రం ప్రస్తుతం కమిటైన తమిళ సినిమాలు పూర్తి చేశాకనే మిగతా సినిమాలు చేయాలని అనుకుంటుందట. ఇన్నాళ్లు బాలీవుడ్ ఆడియన్స్ నయన్ నటన మిస్ అయ్యారు. అయితే జవాన్ తో అది కూడా జరిగింది. ఇక మీదట నయన్ తన మార్కెట్ పెంచుకునే క్రమంలో లేడీ ఓరియెంటెడ్ సినిమాలు చేసినా వాటిని కూడా పాన్ ఇండియా రిలీజ్ ప్లాన్ చేస్తారని తెలుస్తుంది. సౌత్ లేడీ సూపర్ స్టార్ గా క్రేజ్ తెచ్చుకున్న నయన్ ఇక మీదట మరిన్ని ప్రయోగాలు చేయాలని ఫిక్స్ అయ్యింది. జవాన్ చూసిన నయన్ ఫ్యాన్స్ ఆమెను ఇంకా మరెన్నో బాలీవుడ్ సినిమాల్లో చూడాలని కోరుతున్నారు. ఎలాగు బాలీవుడ్ నుంచి ఆఫర్స్ వస్తున్నాయి కాబట్టి కచ్చితంగా నయనతార అక్కడ కూడా అదరగొట్టేస్తుందని చెప్పొచ్చు.

# అనసూయ.. చీరలో కూడా హీటెక్కించే అందం

టెలివిజన్ ప్రపంచంలో యాంకర్ గా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు అందుకున్న అనసూయ భరద్వాజ్ ఆ తర్వాత క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా కూడా పలు సినిమాల్లో కనిపించింది. మొదట గెస్ట్ పాత్రలకే పరిమితమైన ఆమె ఆ తర్వాత మెల్లగా గ్లామరస్ బ్యూటీగా స్పెషల్ పాత్రలలో కూడా మెప్పించింది. ఇక అనసూయ లో మంచి నటి దాగి ఉంది అని పలు పాత్రలు నిరూపించాయి. ముఖ్యంగా రంగస్థలం రంగమ్మత్త పాత్రతోపాటు క్షణం సినిమాలో ఆమె చూపించిన వీలనిజం కూడా బాగా వర్కౌట్ అయింది. ఇక అనసూయ భరద్వాజ్ ప్రస్తుతం తెలుగులోనే కాకుండా ఇతర ఇండస్ట్రీలలో కూడా మంచి అవకాశాలు అందుకుంటుంది. వీలైనంతవరకు ప్రతి పాత్ర కూడా ప్రత్యేకంగా ఉండేలా ఆమె జాగ్రత్తలు తీసుకుంటుంది. అలాగే లేడీ ఓరియంటెడ్ సినిమాలు కూడా చేస్తున్న ఈ సీనియర్ యాంకర్



అప్పుడప్పుడు సోషల్ మీడియాలో ఊహించని విషయాలపై స్పందిస్తూ ఉంటారు. ఇక ఆమె రెగ్యులర్గా సోషల్ మీడియాలో పోస్ట్ చేసే ఫోటోల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఎలాంటి ఫోటో పోస్ట్ చేసిన అందులో గ్లామర్ హైలెట్ అయ్యే విధంగా స్టిల్స్ అయితే ఇస్తూ ఉంటుంది. ఇక రీసెంట్గా అనసూయ భరద్వాజ్ చీరలో కనిపించిన విధానం కూడా ఆమె ఫ్యాన్స్ మనసును దోచేసింది. గతంలో చాలాసార్లు చీరలో కనిపించిన ఆమె ఈసారి మాత్రం అంతకుమించి అనేలా అందంగా ఉంది అంటూ ఫ్యాన్స్ పాజిటివ్గా రియాక్ట్ అవుతున్నారు. స్లీవ్ లెస్ బ్లౌస్ లో వెనకనుంచి ఫోటోకు స్టిల్ ఇచ్చిన అనసూయ చిన్నటి చిరునవ్వుతో కూడా మాయ చేసేసింది. అందానికి పర్ఫెక్ట్ ఉదాహరణ అంటూ ఆమె ఫాలోవర్స్ మరింత పాజిటివ్గా రియాక్ట్ అవుతున్నారు. ఇక అనసూయ భరద్వాజ్ పుష్ప 1 సినిమాలో చేసిన పాత్రకు కూడా మంచి గుర్తింపు లభించింది. ఫస్ట్ పార్ట్ లో ఆమె పాత్ర నిడివి తక్కువగానే ఉన్నప్పటికీ సెకండ్ పార్ట్ లో మాత్రం ఇంకాస్త ఎక్కువ విడివితో కనిపిస్తుందట. అంతేకాకుండా చాలా ఇంపాక్ట్ కూడా చూపిస్తుంది అని ఇదివరకే ఆమె వివరణ ఇచ్చారు. అలాగే హీరోయిన్ గా ఒక వెబ్ సిరీస్ కూడా చేస్తున్న అనసూయ ఇప్పట్లో బుల్లితెరపై మళ్ళీ కనిపించే అవకాశం అయితే లేదు. అలాగే ఆమెకు మలయాళంలో కూడా ఒక సినిమా ఆఫర్ వచ్చినట్లుగా తెలుస్తోంది.




హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్- 1 ప్రిలిమ్స్ పరీక్ష రద్దైంది. గ్రూప్ - 1 ప్రిలిమ్స్ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని హైకోర్టు ఆదేశించింది. జూన్ 11న రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఈ పరీక్షకు 2.32 లక్షల మందికి పైగా అభ్యర్థులు హాజరైన విషయం తెలిసిందే. మొత్తం 503 గ్రూప్ 1 పోస్టుల భర్తీ కోసం పరీక్ష జరిగింది. అయితే, గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష రద్దు చేసి, మళ్లీ నిర్వహించాలని హైకోర్టులో పలువురు అభ్యర్థులు పిటిషన్‌లు వేశారు. పరీక్షలో బయోమెట్రిక్ వివరాలు తీసుకోలేదన్నారు. హాల్ టికెట్ నంబర్ లేకుండా ఓఎంఆర్ షీట్లు ఇచ్చారని అభ్యర్థులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అభ్యర్థుల పిటిషన్లను పరిగణనలోకి విచారణ చేపట్టిన హైకోర్టు తాజాగా తీర్పును వెలువరించింది. పరీక్షను మళ్లీ నిర్వహించాలని ఆదేశించింది. హైకోర్టు తీర్పుపై డివిజన్ బెంచ్‌కు టీఎస్‌పీఎస్సీ వెళ్లనున్నట్లు తెలుస్తోంది. పేపర్ లీకేజీ కారణంగా గ్రూప్ - 1 పరీక్ష ఇంతకుముందే ఓసారి రద్దైన సంగతి తెలిసిందే.




## హైకోర్టు తీర్పుపై టీఎస్‌పీఎస్సీ కీలక నిర్ణయం

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష రద్దయ్యింది. శనివారం ఉదయం ఈ పరీక్షలు రద్దు చేస్తూ రాష్ట్ర హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. రద్దు చేసిన ఈ పరీక్షను మళ్లీ నిర్వహించాలని టీఎస్‌పీఎస్సీని రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. అయితే.. హైకోర్టు తీర్పు నేపథ్యంలో టీఎస్‌పీఎస్సీ ఏం నిర్ణయం తీసుకోబోతోందన్న దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. అయితే ఈలోపు టీఎస్‌పీఎస్సీ ఉన్నతాధికారులు న్యాయనిపుణులతో చర్చించి కీలక నిర్ణయం తీసుకున్నారు.

**తీర్పుపై అప్పీల్‌కు..! :** హైకోర్టు సింగిల్ బెచ్ ఇచ్చిన తీర్పుపై డివిజన్ బెంచ్‌లో టీఎస్‌పీఎస్సీ సవాల్ చేయనున్నది. ఆర్డర్ కాపీ వెంటనే ఇవ్వాలని హైకోర్టును %యువరాజ% తరపు లాయర్లు కోరారు. సోమవారం అప్పీల్ దాఖలు చేసే అవకాశం కనిపిస్తోంది. దీనిపై ఇంకా పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. కాగా.. జూన్-11న రెండోసారి గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షను నిర్వహించిన సంగతి తెలిసిందే.

**రద్దుకు కారణమిదే..! :** గ్రూప్-1 రద్దు కోరుతూ హైకోర్టులో జూన్‌లో మరో పిటిషన్ దాఖలైంది. ముగ్గురు అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అభ్యర్థుల బయోమెట్రిక్ తీసుకోకుండా, హాల్?టికెట్ నంబర్, ఫొటో లేకుండానే ఓఎమ్మార్ షీట్ ఇచ్చారని ఆ ముగ్గురు పిటిషన్‌లో పేర్కొన్నారు. గ్రూప్-1 పరీక్ష మళ్లీ నిర్వహించాలని పిటిషన్?లో కోర్టును అభ్యర్థించారు. రాష్ట్రవ్యాప్తంగా 994 కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించారు. పరీక్షకు 3,80,081 మంది దరఖాస్తు చేసుకోగా 2,33,248 మందే హాజరయ్యారు. హాజరు శాతం 61.37గా నమోదైంది. టీఎస్‌పీఎస్సీలో లీకేజీ వ్యవహారం కారణంగా ప్రిలిమ్స్ పరీక్షను మళ్లీ నిర్వహించిన సంగతి తెలిసిందే.




హైదరాబాద్: తెలంగాణలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటన షెడ్యూల్ ఖరారైంది. అక్టోబర్ 2న పీఎం మోదీ తెలంగాణలో పర్యటించనున్నారు. మహబూబనగర్ జిల్లాలో ప్రధాని పర్యటన కొనసాగనుంది. పార్లమెంట్ నియోజకవర్గాల్లో ముగ్గురు అగ్రనేతలు పర్యటించాలని గతంలోనే బీజేపీ జాతీయ నాయకత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇప్పటికే నాగర్ కర్నూల్‌లో బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా పర్యటించగా.. ఖమ్మం, చేవెళ్లలో హోంశాఖ మంత్రి అమిత్ షా పర్యటించారు. ఇప్పటికే వరంగల్ సభలో పాల్గొన్న ప్రధాని మోదీ మరోసారి రాష్ట్ర పర్యటనకు రానున్నారు. 29న నిజామాబాద్‌కు వస్తారని గతంలో బీజేపీ నేతలు తెలిపారు.

అయితే బిజీ షెడ్యూల్ నేపథ్యంలో మూడు రోజులు ఆలస్యంగా రాష్ట్రానికి మోదీ రానున్నారు. అధికారిక కార్యక్రమాలు ఉంటాయా, కేవలం పార్టీ కార్యక్రమానికే పరిమితం అవుతారా అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది.

## సింగరేణి అవినీతిపై బహిరంగ చర్చకు సిద్ధం... ప్రభుత్వం సిద్ధమా?

భద్రాద్రి కొత్తగూడెం : సీఎం కేసీఆర్‌పై బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సంచలన ఆరోపణలు చేశారు. సింగరేణి అవినీతిపై బహిరంగ చర్చకు సిద్ధమని... ప్రభుత్వం సిద్ధమా? అని సవాల్ విసిరారు. సింగరేణి పరిధిలోని బొగ్గు బ్లాక్‌ల వేలంలో సింగరేణి పాల్గొనకుండా కేసీఆర్ అడ్డుకున్నారన్నారు.

కోయాగూడెం బ్లాక్ అరబిందో శరత్ చంద్రారెడ్డి కి కట్టబెట్టి లబ్ధి పొందారని ఈటల ఆరోపించారు. ఉద్యమ సమయంలో ఉత్తర తెలంగాణను బొందలగడ్డ గా మార్చారన్న కేసీఆర్, తెలంగాణ వచ్చాక 12 నుంచి 20 ఓపెన్ కాస్ట్ గనులు ఎలా ఎందుకు పెరిగాయని ప్రశ్నించారు. కేసీఅర్ అవినీతి పాలన ప్రజల్లోకి వెళ్ళకుండా చానల్స్



పత్రికల యాజమాన్యాలను కబ్జా చేశారన్నారు. యూట్యూబ్ చానల్స్ వారిని అక్రమ కేసులతో వేధిస్తున్నారని ఈటల అన్నారు.

## చురుగ్గా ఏర్పాట్లు.. తెలంగాణలో షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు?

హైదరాబాద్: ఎన్నికల ప్రక్రియలో వేగం పెరిగిందని, అందుకు అవసరమైన అన్నిచర్యలు చేపడుతున్నామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ తెలిపారు. 24, 25 తేదీల నుంచి సమ్మరి రివిజన్ ప్రారంభమైందని, అది కూడా త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే ఈవీఎంలన్నింటినీ చెక్ చేశామని, అధికారుల శిక్షణ కోసం ఈవీఎంలను తెప్పించామని చెప్పారు. బీఆర్కే భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను సీఈవో వికాస్‌రాజ్ ప్రారంభించారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

వచ్చే నెలలో ఎన్నికలకు అవసరమైన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూముల వంటివి ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ అధికారులను గుర్తించడం, వారికి శిక్షణ ఇవ్వడం, పోలింగ్ స్టేషన్లు పరిశీలించి ఈసీఐ సూచనల ప్రకారం ఆయా ప్రాంతాల్లో కనీస మౌలిక సౌకర్యాలు ఉన్నాయా? లేదా వంటివి పరిశీలించి లేకుంటే సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. కౌంటింగ్ కేంద్రాలను గుర్తించడంతో పాటు, కేంద్ర బలగాలకు వసతి, రవాణా సౌకర్యం, వారికి విధుల కేటాయింపు వంటిపై అంశాలపై దృష్టిసారించామన్నారు. బ్యాలెట్ పేపర్ల ప్రింటింగ్, ఈవీఎంల ర్యాండమైజేషన్ తదితర ఏర్పాట్లు, శిక్షణ కొనసాగుతున్నాయని తెలిపారు.



**అక్టోబరులో రాష్ట్రానికి కేంద్ర ఎన్నికల బృందం :** అక్టోబరులో 3, 4, 5 తేదీల్లో రాష్ట్రానికి కేంద్ర ఎన్నికల బృందం రానుందని వికాస్ రాజ్ తెలిపారు. కేంద్ర బృందం రాష్ట్రంలోని రాజకీయ నాయకులతో, సీఎస్, డీజీపీ, కలెక్టర్లతో సమావేశమవుతుందని వెల్లడించారు. జనవరి నుంచి ఇప్పటి వరకు 15 లక్షల కొత్త ఓట్లు నమోదయ్యాయని, 3లక్షల ఓట్లు రద్దయ్యాయని తెలిపారు. ఫారం-6, 8లు 15వేలకు పైగా వచ్చాయన్నారు. ఓట్ల నమోదు ప్రక్రియ కొనసాగుతోందని వికాస్‌రాజ్ వెల్లడించారు. 6.99 లక్షల మంది యువ ఓటర్లు నమోదు చేసుకున్నారని వివరించారు. ఎన్నికల ప్రక్రియలో వేగం పెరగడంతో షెడ్యూల్ ప్రకారమే తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ఉంటాయని సమాచారం.

## ఖానాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి జాన్సన్ నాయక్‌పై బీజేపీ నాయకుల దాడి..



ఖానాపూర్: మద్యం మత్తులో బీజేపీ నేతలు రెచ్చిపోయారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిపై దాడికి తెగబడిన ఘటన నిర్మల్ జిల్లాలో జరిగింది. బీఆర్ఎస్ నుంచి ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉన్న భూక్యా జాన్సన్ నాయక్ శుక్రవారం రాత్రి రజూరా గ్రామంలో పర్యటించారు. అదే సమయంలో బీజేపీ మాజీ ఎంపీపీ భర్త గడ్డం రవీందర్ తన అనుచరులతో కలిసి అటుగా వచ్చారు. మద్యం మత్తులో ఉన్న రవీందర్, ఆయన అనుచరులు.. జాన్సన్ నాయక్ కారును ఢీకొట్టారు. అంతేకాకుండా జాన్సన్ మీద దాడికి ప్రయత్నించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. బీఆర్ఎస్ నాయకులు సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మద్యం మత్తులో దాడిచేసిన బీజేపీ నాయకులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్?కు తరలించారు. విషయం తెలుసుకున్న బీజేపీ నేత, మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ తన అనుచరులతో కలిసి పోలీస్ స్టేషన్?కు చేరుకొని వీరంగం సృష్టించారు. పోలీసులపై దాడి చేసేలా కార్యకర్తలను రెచ్చగొట్టారు. అంతేకాకుండా.. స్టేషన్?లోని కిటికీలు, తలుపులను విరగ్గకొట్టి హంగామా చేశారు.

**మల్కాజిగిరి నుంచే తాను పోటీ చేయనున్నట్లు ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. దూలపల్లిలోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. రెండు నియోజక వర్గాల్లో పోటీ చేస్తున్నానని కొందరు అపోహలు సృష్టిస్తున్నారని తెలిపారు. అందులో ఎలాంటి వాస్తవం లేదని కొట్టి పడేశారు.**




## బీఆర్ఎస్‌కు షాక్.. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీపై కేసు నమోదు



హైదరాబాద్: నార్సింగ్‌లో అధికార బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఓ స్థలంపై కన్నేశారు. అక్రమంగా భూమిని కబ్జా చేసే ప్లాన్ చేశారు. ఈ నేపథ్యంలో బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో వారిపై నార్సింగిలో కేసు నమోదు అయ్యింది. ఈ ఘటన రాజకీయంగా ప్రాధాన్యతను సంతరించుకుంది.

**కోకాపేట ల్యాండ్స్..** వివరాల ప్రకారం.. నార్సింగిలో భూవివాదంలో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డిలపై కేసు నమోదు చేశారు పోలీసులు. కోకాపేటలోని సర్వే నంబరు 85లో 2 ఎకరాల 30 గుంటల భూమిపై పెట్టుబడిదారులు, డెవలపర్ మధ్య వివాదం నెలకొంది. దీన్ని పరిష్కరించుకోకుండా డెవలపర్ నిర్మించిన తాత్కాలిక గుడిసెల్లో నివాసముంటున్న కూలీలను ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలతో పాటు వారి అనుచరులు ఖాళీ చేయించారని డెవలపర్ ప్రతినిధి గుండు శ్రవణ్ గురువారం రాత్రి ఫిర్యాదు చేయగా.. అదేరోజు పోలీసులు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేపై పోలీసులు కేసు నమోదు చేశారు. కోకాపేటలోని సర్వేనంబరు 85లోని స్థలాన్ని గోల్డ్ ఫిష్ అడోబ్ సంస్థ కొద్ది నెలల నుంచి అభివృద్ధి చేస్తోంది.

**అక్రమంగా తరలింపు..** అయితే, గోల్డ్‌ఫిష్ సంస్థతో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామ్‌రెడ్డికి కొన్ని నెలలుగా వివాదం కొనసాగుతున్నట్టు గోల్డ్ ఫిష్ అడోబ్ సంస్థ ప్రతినిధి గుండు శ్రవణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురువారం ఉదయం ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలతో కలిసి దాదాపు 60 మందికిపైగా కోకాపేటలోని స్థలానికి వచ్చారు. గుడిసెల్లో నివాసముంటున్న కూలీలను ఖాళీ చేయాలంటూ దౌర్జన్యం చేశారు. ఎమ్మెల్సీ అనుచరులు కూలీల తట్టా, బుట్టా బయటకు విసిరేయడమే కాకుండా గర్భిణులపై దురుసుగా ప్రవర్తించారు. ఈ లోపు సమాచారం అందుకున్న నేను అక్కడికి వెళ్లగా.. నాపైనా దాడి చేశారు. డీసీఎం వాహనాలను తీసుకువచ్చి కూలీలను బలవంతంగా వాహనాల్లోకి ఎక్కించారు. కాంటినెంటల్ ఆసుపత్రి వద్ద కూలీలను వదిలేసి మరోసారి అక్కడికి వెళితే అంతేనంటూ హెచ్చరించి వెళ్లిపోయారు అని తెలిపారు. దీంతో, తాము పోలీసులను ఆశ్రయించినట్టు స్పష్టం చేశారు. ఈ ఘటనలో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామ్‌రెడ్డి, కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డిలతో పాటుగా మరో ఆరుగురిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.




హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల ప్రజలకు మరో రెండు వందే భారత్ రైళ్లు అందుబాటులోకి రానున్నాయి. దేశవ్యాప్తంగా 9 వందే భారత్ రైళ్లను ఒకేసారి ఈ నెల 24న ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఇందులో కాచిగూడ- యశ్వంత్‌పూర్, చెన్నై - విజయవాడ మధ్య నడిచే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు కూడా ఉన్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రూట్లలో మెరుగైన సదుపాయాలతో వస్తున్న ఈ రైళ్లు ప్రయాణికుల అవసరాలను తీర్చనున్నాయి. తాజాగా వీటి టికెట్ ధరలు వెల్లడయ్యాయి.

**కాచిగూడ - యశ్వంత్‌పూర్ 1600 :** కాచిగూడ నుంచి యశ్వంత్‌పూర్ (20703) మధ్య బుధవారం మినహా మిగిలిన ఆరు రోజులు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు అందుబాటులో ఉంటుంది. ఆయా రోజుల్లో ఉదయం 05:30 గంటలకు రైలు కాచిగూడ నుంచి ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం 2 గంటలకు యశ్వంత్‌పూర్ (బెంగళూరు) జంక్షన్ చేరుకుంటుంది. 610 కిలోమీటర్ల దూరానికి 8.30 గంటల ప్రయాణం ఉంటుంది. మధ్యలో మహబూబ్‌నగర్ (6.49), కర్నూలు సిటీ (8.24), అనంతపురం (10.44), ధర్మవరం జంక్షన్ (11.14) స్టేషన్లలో ఆగుతుంది. కాచిగూడ నుంచి యశ్వంత్‌పూర్‌కు ఛైర్‌కార్ టికెట్ ధర రూ.1600గా రైల్వే శాఖ నిర్ణయించింది. ఎగ్జిక్యూటివ్ ఛైర్‌కార్ ధర రూ.2915గా నిర్ణయించారు. ఇందులో కేటరింగ్ ఛార్జీలు అంతర్భాగంగా ఉంటాయి. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (20704) మధ్యాహ్నం 2.45 గంటలకు యశ్వంతపూర్‌లో బయల్దేరుతుంది. రాత్రి 11.15 గంటలకు కాచిగూడ స్టేషన్‌కు చేరుకుంటుంది. ధర్మవరం జంక్షన్ (4.59), అనంతపురం (5.29), కర్నూలు సిటీ (7.50) మహబూబ్‌నగర్ (9.34) స్టేషన్లలో నిమిషం చొప్పున ఆగుతుంది. తిరుగు ప్రయాణంలో మాత్రం ఛైర్‌కార్ టికెట్ ధర రూ.1540 గానూ, ఎగ్జిక్యూటివ్ క్లాస్ టికెట్ ధర రూ.2865గానూ రైల్వే శాఖ నిర్ణయించింది. కేటరింగ్ ఛార్జీల్లో వ్యత్యాసమే ఇందుక్కారణం.

**ఆరున్నర గంటల్లో విజయవాడ- చెన్నై -** తెలుగు రాష్ట్రాల్లో అత్యంత రద్దీ రూట్లలో ఒకటైన చెన్నై- విజయవాడ (20677) మధ్య ఇంకో వందేభారత్ రైలు అందుబాటులోకి వస్తోంది. ఈ రైలు 517 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 6.40 గంటల్లో చేరుకుంటుంది. మంగళవారం మినహా మిగిలిన ఆరు రోజులు ఈ రైలు అందుబాటులో ఉంటుంది. ఉదయం చెన్నైలో ఉదయం 5.30 గంటలకు బయల్దేరే ఈ రైలు మధ్యాహ్నం 12.10 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. మార్గమధ్యంలో రేణిగుంట (7.05), నెల్లూరు (8.39), ఒంగోలు (10.09), తెనాలి (11.21) స్టేషన్లలో ఆగుతుంది. ఛైర్‌కార్‌లో రూ.1320, ఎగ్జిక్యూటివ్ క్లాస్ టికెట్ ధరను రూ.2540గా రైల్వే శాఖ నిర్ణయించింది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (20678) మధ్యాహ్నం 3.20 గంటలకు విజయవాడ నుంచి చెన్నై బయల్దేరుతుంది. రాత్రి 10 గంటలకు చెన్నై చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఛైర్ టికెట్ ధర రూ.1420, ఎగ్జిక్యూటివ్ క్లాస్ ధర రూ.2630గా నిర్ణయించారు. ఇరువైపులా నిర్దేశిత స్టేషన్లలో ఒక్కో నిమిషం మాత్రమే రైలు ఆగుతుంది. ఒక్క రేణిగుంటలో మాత్రమే 5 నిమిషాల స్టాపును నిర్దేశించారు.

## కేసీఆర్‌కు మైనంపల్లి సంచలన లేఖ.. బీఆర్ఎస్‌లో టెన్షన్!

హైదరాబాద్: తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. తాజాగా అధికార బీఆర్ఎస్ మాల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పార్టీకి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో పార్టీ అధినేత కేసీఆర్‌కు మైనంపల్లి లేఖ రాయడం హాట్ టాపిక్‌గా మారింది. ఇక, లేఖలో బీఆర్ఎస్ పార్టీ నేతలపై మైనంపల్లి సంచలన ఆరోపణలు చేశారు. మైనంపల్లి లేఖలో.. బీఆర్ఎస్ పార్టీలో కొందరు సీనియర్ నేతలతో తీవ్రవిబేధాలు ఉన్నాయన్నారు. బీఆర్ఎస్‌లో పారదర్శకత, ప్రజాస్వామ్యం లేదంటూ నిప్పులు చెరిగారు. బీఆర్ఎస్ పార్టీ అగ్రనాయత్వం క్షేత్రస్థాయిలో ఉన్న శ్రేణుల అభిప్రాయాలను పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. పార్టీ పేరు మార్చడం కార్యకర్తలకు ఇష్టం లేదని, ఇతర రాష్ట్రాల్లో పార్టీ విస్తరణ తెలంగాణలో నష్టం వాటిల్లిందన్నారు. అధికారం కోసం ఆరాటపడే కొందరి చేతుల్లోకి బీఆర్ఎస్ వెళ్లిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**దేనికీ లొంగే ప్రసక్తే లేదు..** అంతకుముందు.. మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి ఒక వీడియో ప్రకటనను ఆయన విడుదల చేశారు. మల్కాజిగిరి ప్రజలు, శ్రేయోభిలాషుల కోరిక మేరకు బీఆర్ఎస్ పార్టీని వీడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రజల కోరిక మేరకే ముందుకు నడుస్తానని, దేనికీ లొంగే ప్రసక్తి లేదని వ్యాఖ్యానించారు.

**రోహిత్‌కు నో టికెట్..** ఇదిలా ఉండగా.. గత నెల 21న బీఆర్ఎస్ అసెంబ్లీ అభ్యర్థుల జాబితాను పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించడానికి కొన్ని గంటల ముందు మంత్రి హరీశ్‌రావుపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అయినా సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన మైనంపల్లికే మరోమారు టికెట్ కేటాయించిన కేసీఆర్.. కానీ, ఆయన కుమారుడు రోహిత్‌కు మాత్రం టికెట్ ఇవ్వలేదు. దీంతో మైనంపల్లి కాంగ్రెస్‌లోకి వెళ్తున్నారనే ప్రచారం జరిగినా బీఆర్ఎస్ వేచి చూసే ధోరణి అవలంభించింది. ఈ నెల 26న ఢిల్లీలో సోనియా, రాహుల్ సమక్షంలో మైనంపల్లి కాంగ్రెస్‌లో చేరిక ఖాయం అయ్యింది. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com